PRGI NO : TGTEL/26/A2002

EDITOR: PEMBI MAHENDHAR

# నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 114 | పేజీలు : 8 | ఆదివారం 13 సెప్టెంబర్ 2026 | వెల : 4/-






## బ్రిక్స్ కూటమి ఏ దేశానికి
# వ్యతిరేకం కాదు



- దిల్లీలో ప్రారంభమైన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు
- అతిథులు అందరికీ స్వాగతం పలికిన ప్రధాని మోదీ
- భారతదేశ బ్రిక్స్ అధ్యక్షత అనేది ప్రజల కేంద్రంగా, మానవత్వమే మొదటి ప్రాధాన్యత అనే విధానంపై ఆధారపడి ఉంది
- స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత మా ప్రాధాన్యతలు
- వీటితోపాటు బ్రిక్స్ సహకారాన్ని సామాన్య ప్రజలతో అనుసంధానించడంపై మేము ప్రత్యేకంగా దృష్టి సారించాం

## దిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించిన బ్రిక్స్ సదస్సు

బ్రిక్స్ దిల్లీ డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ

విభేదాలు పక్కనపెట్టి దిల్లీ డిక్లరేషన్‌కు ఆమోదం తెలిపిన అరబ్ దేశాలు

భారత్ ఆకాంక్షలకు రష్యా, చైనా మద్దతు

డాలర్‌కు బదులుగా సొంత కరెన్సీలతో వాణిజ్యం

# పన్నుపై అపోహలొద్దు



- 20 శాతాన్ని సీఎం ఆమోదం మేరకు 10 శాతానికి తగ్గిస్తున్నాం
- 'క్యూర్'లో ఆస్తి పన్నుల పెంపుపై స్పష్టతనిచ్చిన మంత్రి శ్రీధర్‌బాబు
- ఈ మేరకు బిల్లుకు సవరణ ప్రతిపాదించిన స్పీకర్.. ఆమోదించిన అసెంబ్లీ
- అపెక్స్ కౌన్సిల్‌కు మేయర్లనూ ఆహ్వానించాలని కోరిన బీజేపీ, ఎంఐఎం

హైదరాబాద్

కోర్ అర్బన్ రీజియన్‌లో పన్నులపై అపోహలు వద్దని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టంచేశారు. ప్రతి ఏటా 20 శాతం ఆస్తి పన్నులు పెరుగుతాయనే విషయం వాస్తవం కాదన్నారు. పన్నులు ఎలా అంటే అలా పెంచడానికి వీల్లేదని, ప్రస్తుతం అమల్లో ఉన్న కంప్యూటేషన్ పద్ధతి ప్రకారమే పన్నులు పెరుగుతాయని, గరిష్టంగా 10 శాతానికి మించి పెరగవన్నారు. అది కూడా కేవలం 0.15 శాతం నివాస, 0.75 శాతం వాణిజ్య సముదాయాల మీద మాత్రమే పడుతుందని వివరించారు. శనివారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరఫున కోర్ అర్బన్ రీజియన్ (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) బిల్లు--2026 (క్యూర్)ను ప్రవేశపెట్టిన శ్రీధర్‌బాబు చట్టం లక్ష్యాలను వివరించారు. క్యూర్ పరిధిలోని - మిగతా3లో



## బ్రిక్స్‌లో భారత్ దౌత్య బలం చూపించాలి

- మోదీ సర్కార్‌కు కాంగ్రెస్ కీలక సూచనలు
- గ్లోబల్ సౌత్‌లో భారత్‌పై నమ్మకం పెంచాలన్న కాంగ్రెస్ ఇరాన్ విషయంలో ఉన్న అనుమానాలకు సమాధానం ఇవ్వాలన్న హస్తం పార్టీ
- సమ్మిట్ వివరాలపై మోదీ ప్రెస్‌మీట్ పెట్టాలని డిమాండ్
- ఇరాన్ విషయంలో స్పష్టత ఇవ్వాల్సిందే!
- యుద్ధం నేపథ్యంలో బ్రిక్స్ సభ్య దేశాల మధ్య విభేదాలు కనిపిస్తున్నాయి

## అన్ని సౌకర్యాలు
# అందిస్తాం

### భక్తితో గణనాథుడిని పూజిద్దాం

- గణేశ్ మండప నిర్వాహకులతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- అసెంబ్లీ ఆవరణలోని శాసన మండలి కాన్ఫరెన్స్ హాల్‌లో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- ఈ రివ్యూకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు హాజరు.
- గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలి
- శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత వహించాలి
- ఇందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలి
- హైదరాబాద్ ప్రశాంతంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయి
- ఏసమస్యలున్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది



హైదరాబాద్

గణేశ్ ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఆవరణలోని శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ పలు కీలక సూచనలు చేశారు. గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత వహించాలని - మిగతా3లో

# మేం కొత్తగా పెట్టిందేమీ లేదు

- అయితే ఉండకూడనివి కూడా 22ఏ జాబితాలో పడ్డాయి
- అప్‌డేట్ కాని ధరణి కాపీనే మళ్లీ అప్‌లోడ్ చేయడంతోనే సమస్యలు
- తప్పు జరిగిన మాట వాస్తవం... కానీ సరిదిద్దుతున్నాం
- దొంగే పోలీస్‌ను దొంగా దొంగా అన్నట్టు బీఆర్ఎస్ వైఖరి
- ప్రజల ఆస్తులపై హక్కులకు సంపూర్ణ రక్షణ కల్పిస్తాం
- ఏడాదిన్నరలోపే భూముల సర్వే చేస్తాం
- ధరణి ఫోరెన్సిక్ ఆడిటింగ్‌లో భయంకర విషయాలు తేలాయి... అన్నీ 'సెట్'కు పంపాం



హైదరాబాద్

'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిషేధిత 22ఏ జాబితాలో పెట్టిన భూములేవీ లేవు. మేం అధికారంలోకి వచ్చాక ఈ జాబితాను కొత్తగా తయారు చేయలేదు. 1999లో ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌ను రిజిస్ట్రేషన్ చేసినప్పుడు ఈ జాబితా అవసరం వచ్చింది. అప్పటి నుంచి కొనసాగుతోంది. 2009లో కోర్టు ఆదేశానుసారం ఈ జాబితా తయారు చేశారు. 2009--15 వరకు ఈ జాబితాపై హైకోర్టులో రెండువేల కేసులు పడ్డాయి. ఆ సమయంలో ఐదుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. 22ఏ జాబితా భూములను ఐదు కేటగిరీల్లో వర్గీకరించాలని చెప్పింది. కానీ, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పని చేయలేదు. ఈ నేపథ్యంలో 2017--25 వరకు హైకోర్టులో 28,611 కేసులు పడ్డాయి. దీంతో 45 రోజుల్లో ఈ జాబితా - మిగతా3లో



## ఎన్నికల ప్రక్రియకు పునాది ఓటర్ల జాబితానే


- ప్రపంచంలోనే అత్యంత పారదర్శక ఎన్నికల వ్యవస్థల్లో భారత్‌ది ఒకటి
- భారత ఎన్నికల ప్రక్రియపై సీఈసీ కీలక వ్యాఖ్యలు
- రాజకీయ పార్టీలు, అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లు నిరంతరం పరిశీలనలో భాగస్వాములవుతున్నారు
- యువత ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపు
- 18 ఏళ్లు పూర్తి చేసుకున్న అర్హత కలిగిన ప్రతి భారతీయ పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటం ఎన్నికల యంత్రాంగం బాధ్యత

# ఎప్పటిలోగా తొలగిస్తారో చెప్పాలి

- 22ఏ భూముల నుంచి ప్రజలకు ఎప్పుడు విముక్తి కల్పిస్తారు:హరీశ్‌రావు
- తప్పు జరిగిందని ఒప్పుకున్నారు.. క్షమాపణ చెప్పి గడువు ప్రకటించాలి
- తన కుటుంబంపై ఆరోపణలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని నిలదీత
- 29 ఎకరాలు నావని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా: ఎమ్మెల్యే పల్లా

హైదరాబాద్

రాష్ట్రంలో అత్యంత ప్రధానమైన 22ఏ నిషేధిత భూముల సమస్యకు ప్రభుత్వం తక్షణ పరిష్కారం చూపాలని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆయన శనివారం రాత్రి తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా బాధితులకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఉద్దేశపూర్వకంగా సస్పెండ్ చేసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అబద్ధాల ప్రవాహం పారించారని ఆరోపించారు. తాను అడిగిన ఏ ప్రశ్నకూ మంత్రి సమాధానం చెప్పలేదన్నారు. డిసెంబర్ 3, 2025న - మిగతా3లో



నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
13 సెప్టెంబర్ 2026

# బ్రిక్స్ కూటమి ఏ దేశానికి వ్యతిరేకం కాదు

బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు 2026ను భారత ప్రధాని నరేంద్ర మోదీ శనివారం అధికారికంగా ప్రారంభించారు. సందర్భంగా మోదీ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ సమస్యల పరిష్కారం దిశగా బాధ్యతలు తీసుకునేందుకు భారత్? సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. బ్రిక్స్ కూటమి ఏ దేశానికి వ్యతిరేకం కాదని ప్రధాని ఉద్ఘాటించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా గ్లోబల్ గవర్నెన్స్ మెరుగుపరచడానికి 10 సూత్రాలతో కూడిన ఒక సమగ్ర రోడ్‌మ్యాప్‌ను ప్రధాని మోదీ ప్రతిపాదించారు.

"మీ అందరికీ స్వాగతం పలకడం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. భారతదేశ బ్రిక్స్ అధ్యక్షత అనేది ప్రజల కేంద్రంగా, మానవత్వమే మొదటి ప్రాధాన్యత అనే విధానంపై ఆధారపడి ఉంది. స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత మా ప్రధాన్యతలు. వీటితోపాటు బ్రిక్స్ సహకారాన్ని సామాన్య ప్రజలతో అనుసంధానించడంపై మేము ప్రత్యేకంగా దృష్టి సారించాం. ఈ దార్శనికతను దృష్టిలో ఉంచుకొని, 350 కిపైగా సమావేశాలు నిర్వహించాం. సుమారు 30 నగరాల్లో మీ బృందాలకు స్వాగతం పలికే అ వకాశం మాకు లభించింది. బ్రిక్స్ ఏర్పాటు చేసి రెండు దశాబ్దాలు పూర్తయ్యింది. ఇందులోని సభ్యదేశాల ప్రజలకు మనం భరోసా కల్పించాలి. పరస్పర సహకారంతో బ్రిక్స్ దేశాలు మరి అభివృద్ధి చెందాలి. ముఖ్యంగా అంతర్జాతీయ సమస్యలకు మనం పరిష్కారం చూపించాల్సి ఉంది. మనం వేసే ప్రతి అడుగులో మానవాభివృద్ధే కాలం కావాలి. అంతేకాదు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో కూడా సంస్కరణలు చేపట్టాలి. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఘర్షణలను పరిష్కారం చూపించాలి. ఇందుకోసం మనం ఉమ్మడి బాధ్యత తీసుకుందాం. అలాగే ఏఐ, సైబర్ స్పేస్?, బయోటెక్నాలజీ రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలి. అంతేకాదు గ్లోబల్ సౌత్ దేశాలకు దిశానిర్దేశం చేయాలి' అని మోదీ అన్నారు.



### బ్రిక్స్ ఎవరికీ వ్యతిరేకం కాదు!

"మనం బ్రిక్స్ 20వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఇదొక చారిత్రాత్మక మైలురాయి. మానవ జీవితంలో 20ఏళ్ల వయస్సు అనేది పరిణితి, బాధ్యతతో కూడిన ఒక కొత్త దశకు నాంది పలుకుతుంది. ఇది బాధ్యతలు, ఆకాంక్షలతో ముడిపడే, సామర్థ్యాలను కొత్త దిశను కనుగొనే దశ. నేడు బ్రిక్స్ కూడా సరిగ్గా ఇలాంటి పరిణితి చెందిన దశలోనే ఉంది. మనం ఒకరి దృక్పథాలను మరొకరం గౌరవించుకుంటూ, ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతున్నాం. మన విధానం ఎవరికీ వ్యతిరేకం కాదు. అందరినీ కలుపుకుపోవడమే మన లక్ష్యం. ఇప్పుడు బ్రిక్స్? దేశాల ఐక్యతను, ఏకాభిప్రాయాన్ని ప్రపంచ వేదికపై స్పష్టమైన ఫలితాలుగా మార్చాల్సిన సమయం ఆసన్నమైంది."

### సంస్కరణలు చేపట్టాల్సిందే!

రానున్న 20 ఏళ్ల కోసం ఒక సరికొత్త, ప్రతిష్ఠాత్మకమైన ఎజెండాను రూపొందించాలని ప్రధాని మోదీ బ్రిక్స్? దేశాలకు పిలుపునిచ్చారు. "బ్రిక్స్ అధ్యక్ష పదవి ఏటా మారుతున్నప్పటికీ, అది మన సంస్థాగత వేగానికి ఆటంకం కలగకూడదు. ఇందుకోసం మన ఒక ప్రత్యేకమైన పర్యవేక్షణ వ్యవస్థను (ట్రోయ్కా–ఒతీశీఱఅఝ ఖతీతీఝఅస్త్రవఎవత్) ఏర్పాటు చేయాలి. దీని వల్ల ఫలితాలను నిరంతరం పర్యవేక్షించడానికి వీలు కలుగుతుంది. అలాగే ప్రతి నిర్ణయానికి సంబంధించిన నోడల్ పాయింట్, కాలపరిమితి, పని ఎంత వరకు వచ్చిందో రికార్డు చేయడానికి ఒక సురక్షితమైన రిపోజిటరీ (డిజిటల్ స్టోరేజ్)ని ఏర్పాటు చేయాలి" అని మోదీ అన్నారు.

### బ్రిక్స్ మరింత బలోపేతం

"బ్రిక్స్‌ను మరింత బలోపేతం చేయడంతోపాటు, ప్రపంచ సంస్కరణల కోసం మనం ఒక మార్గాన్ని కూడా సుగమం చేయాలి. ప్రస్తుత ప్రపంచ పాలనా విధానం (గ్లోబల్ గవర్నెన్స్) నిర్మాణం ఒక పిరమిడ్?లా ఉంది. అధికారం, నిర్ణయాధికారాలు కేవలం పైనున్న కొన్ని దేశాల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. కింది శ్రేణిలో ఉన్న దేశాలు ఆ నిర్ణయాల వల్ల ప్రభావితమవుతున్నప్పటికీ, వాటిని మార్చగల శక్తి వాటికి లేదు. అందుకే ఈ పద్ధతి మారాలి. ఇందుకోసం సంస్కరణలు చేపట్టాలని" మోదీ పేర్కొన్నారు.

### ఉమ్మడి ప్రకటన

కాగా, ఈ రోజు బ్రిక్స్ దేశాలన్నీ కలిసి ఒక ఉమ్మడి ప్రకటన చేయనున్నాయి. శనివారం జరిగిన సుదీర్ఘమైన చర్చల తర్వాత బ్రిక్స్ దేశాలు ఓ ఏకాభిప్రాయానికి వచ్చాయి. పలు వివాదాస్పద అంశాలపై భేదాభిప్రాయాలు వ్యక్తమయినప్పటికీ, భారత్? నిరంతర చర్చలు, సంప్రదింపుల ద్వారా సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించింది. ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ మధ్య ప్రాంతీయ, భౌగోళిక, రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, వారంతా ఒకే వేదికపైకి వచ్చి ఈ ఉమ్మడి ప్రకటనకు అంగీకరించేలా చేయడంలో భారత్ విజయం సాధించింది.

# దిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించిన బ్రిక్స్ సదస్సు

సభ్యదేశాల ఆమోదంతో బ్రిక్స్ దిల్లీ డిక్లరేషన్‌ను శనివారం ప్రధాని మోదీ స్వయంగా ప్రకటించారు. భారత్ దైత్యం ఫలితంగా, విభేదాలు పక్కనపెట్టి దిల్లీ డిక్లరేషన్‌కు అరబ్ దేశాలైన ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా ఆమోదం తెలిపడం విశేషం. ఈ ప్రకటనకు ముందు జరిగిన చర్చలు చివరి నిమిషం వరకు ఉత్కంఠభరితంగా సాగాయి. ఎందుకంటే ప్రారంభంలో ఇరాన్, యూఏఈలు కఠిన వైఖరి అవలంభించాయి. బ్రిక్స్ అనేది పూర్తిగా ఏకాభిప్రాయంతో నడిచే కూటమి, కనుక ఏ ఒక్క సభ్యదేశం వ్యతిరేకించినా సరే ఉమ్మడి ప్రకటన నిలిచిపోతుంది. ఇలాంటి తరుణంలో భారత్ అద్భుతమైన దౌత్య విజయం సాధించింది. శనివారం జరిగిన బ్రిక్స్ కూటమి సమావేశంలో సభ్యదేశాలన్నీ ఏకాభిప్రా యంతో ఒక జాయింట్ డిక్లరేషన్‌ను ఆమోదించాయి. పశ్చిమాసియా సంక్షోభం విషయంలో ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా మధ్య తీవ్రమైన విభేదాలు ఉన్నప్పటికీ, తెరవెనుక జరిగిన వరుస చర్చల ఫలితంగా ఈ ప్రతిష్టంభనకు తెరపడింది. దీనితో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఈ జాయింట్ డిక్లరేషన్ ఆమోదం పొందినట్లు తాజాగా అధికారికంగా ప్రకటించారు.

### పాత వ్యవస్థలు ఇక పనికిరావు!

ఈ బ్రిక్స్ సదస్సు ప్రారంభ సెషన్ ముగిసిన తర్వాత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్?పింగ్?తో కరచాలనం చేస్తూ కనిపించారు. సదస్సు ముగింపు ఉపన్యాసంలో మోదీ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "మారుతున్న ప్రపంచాన్ని పాతపడిపోయిన వ్యవస్థలు నడపలేవు. నేటి చర్చల ద్వారా ఈ విషయం స్పష్టమైంది. ప్రాతినిధ్యం, స్పందన, నియమ నిబంధనల రూపకల్పనలో కచ్చితంగా సంస్కరణలు అవసరం. అలాగే భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధిలో, వాటి నియంత్రించే నిబంధన రూపకల్పనలో గ్లోబల్ సౌత్? దేశాలకు సమాన భాగస్వామ్యం ఉండాలని మేము నొక్కి చెప్పాము. నిర్ణయాలకు, వాటి ఫలితాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని– భాగస్వామ్యం, ఉమ్మడి కార్యాచరణ ద్వారా మాత్రమే పూడ్చగలం. ఈ రోజు ఆమోదించిన దిల్లీ డిక్లరేషన్? మన ఉమ్మడి సంకల్పానికి ఒక స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుంది. ఈ తీర్మానాలను ఆచరణాత్మక ఫలితాలుగా మార్చవలసిన బాధ్యత ఇప్పుడు మనందరిపైనై ఉంది" అని మోదీ పేర్కొన్నారు.

ఐరాస భద్రతా మండలిలో నిర్మాణాత్మక మార్పులు, ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు భద్రతా మండలిలో మెరుగైన ప్రాతినిధ్యం దక్కాలని దిల్లీ డిక్లరేషన్ ఆకాంక్షించింది. ముఖ్యంగా భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్ దేశాలకు మరింత పెద్ద పాత్ర దక్కాలన్న డిమాండ్‌కు శాశ్వత సభ్య దేశాలైన చైనా, రష్యాలు తమ మద్దతును పునరుద్ఘాటించాయి. ఐఎంఎఫ్?, ప్రపంచ బ్యాంకుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం దక్కాలని బ్రిక్స్ కూటమి డిమాండ్ చేసింది.

### డాలర్‌కు బదులుగా సొంత కరెన్సీలతో వాణిజ్యం

వాణిజ్యపరంగా ఈ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం డాలర్‌కు బదులుగా స్థానిక కరెన్సీలలోనే ఎక్కువగా జరగాలని, సరిహద్దు చెల్లింపుల కోసం ఆచరణాత్మక పరిష్కారాలను సులభతరం చేయాలని డిక్లరేషన్ పేర్కొంది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలు, బలవంతపు చర్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ ప్రదర్శించాలని పిలుపునిచ్చింది. పహల్గాం ఉగ్రదాడిని బ్రిక్స్ డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. సరిహద్దు ఉగ్రవాదం, ఉగ్ర నిధులు అరికట్టాలని, ఉగ్రవాద నిర్మూలనలో ద్వంద్వ వైఖరి వీడాలని స్పష్టం చేసింది. అలాగే అణు కేంద్రాలపై జరుగుతున్న దాడులను, పెరుగుతున్న అణ్వస్త్ర ప్రమాదాలను ఖండించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందాల్సిన నిధులను పక్కదారి పట్టిస్తూ, గ్లోబల్ మిలిటరీ ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం పట్ల విచారం వ్యక్తం చేసింది. అలాగే అభివృద్ధి చెందుతున్న దేశాలకు శిలాజ ఇంధనాలు ఇంకా అవసరమేనని స్పష్టం చేస్తూనే, పర్యావరణ అనుకూల ఇంధనాల వైపు మారాలని డిక్లరేషన్ సూచించింది. ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటుకు బ్రిక్స్ దేశాలు తీర్మానించాయి. ఆర్థిక, సామాజిక వృద్ధిలో నిర్ణయాధికారులుగా మహిళల పాత్ర అత్యంత కీలకమని న్యూదిల్లీ డిక్లరేషన్ గుర్తించింది.

# ఎన్నికల ప్రక్రియకు పునాది ఓటర్ల జాబితానే

భారత ఎన్నిక వ్యవస్థపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఎన్నికల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతోందని అన్నారు. ఓటర్ల జాబితాల తయారీ నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలోనూ ధ్రువీకరణ జరుగుతోందని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లు నిరంతరం పరిశీలనలో భాగస్వాములవుతున్నారని, అందుకే ప్రపంచంలోనే అత్యంత పారదర్శక ఎన్నికల ప్రక్రియల్లో భారత్‌ది ఒకటని పేర్కొన్నారు. గుజరాత్ యూనివర్సిటీలోని అటల్ కలాం హాల్‌లో శుక్రవారం నిర్వహించిన బూత్ లెవల్ ఆఫీసర్లతో పరస్పర సమావేశం కార్యక్రమంలో సీఈసీ ఈ వ్యాఖ్యలు చేశారు.



ఎన్నికల ప్రక్రియకు పునాది ఓటర్ల జాబితానేనని జ్ఞానేశ్ కుమార్ అన్నారు. రాజకీయ పార్టీలు, వారి బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) భాగస్వామ్యంతో ఓటర్ల జాబితాలను నిరంతరం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారని అన్నారు. లేని వారు, వేరే ప్రాంతానికి తరలిపోయిన వారు మరణించిన వారు, డూప్లికేట్ నమోదులు, విదేశీయుల పేర్లు వంటి అంశాలను గుర్తించాల్సి ఉంటుందని వివరించారు. అదే సమయంలో అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. 18 ఏళ్లు పూర్తి చేసుకున్న అర్హత కలిగిన ప్రతి భారతీయ పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటం ఎన్నికల యంత్రాంగం బాధ్యత అని పేర్కొన్నారు. యువతకు ఓటు హక్కు లభించిన వెంటనే వారి పేర్లను నమోదు చేసే ప్రక్రియపై బీఎల్ఓలు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. బీఎల్ఓలు తమ ప్రాంతాల్లోని ఓటర్ల ఇళ్లకు వెళ్లి నేరుగా వివరాలను సేకరించి, అవసరమైన సమాచారాన్ని ధ్రువీకరిస్తున్నారని తెలిపారు. తగిన పత్రాల సమర్పణ, వివరాల మ్యాపింగ్, అవసరమైన చోట విచారణ వంటి ప్రక్రియల ద్వారా ఓటర్ల జాబితాల కచ్చితత్వాన్ని పెంచుతున్నట్లు వివరించారు.

### ఈవీఎం, వీవీప్యాట్‌లపైనా ధ్రువీకరణ

పోలింగ్ ప్రక్రియలో పారదర్శకతను ఈవీఎం, వీవీప్యాట్ తనిఖీలు కీలకమని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. పోలింగ్ ప్రారంభానికి ముందు అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్? పోలింగ్ నిర్వహించి యంత్రాల పనితీరును పరిశీలిస్తారని చెప్పారు. పోలింగ్ పూర్తైన తర్వాత ఈవీఎంల్లో నమోదైన ఫలితాలకు సంబంధించిన ప్రక్రియను కూడా అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలోనే పూర్తి చేస్తారని వివరించారు అవసరమైన పత్రాలపై వారి సమక్షంలో సంతకాలు తీసుకుంటారని తెలిపారు. ఓట్ల లెక్కింపు సమయంలోనూ పలు దశల్లో ధ్రువీకరణ ఉంటుందని సీఈసీ వెల్లడించారు. ఈవీఎంలలో నమోదైన ఓట్ల సంఖ్యను ఫామ్–17సీలో పేర్కొన్న ఓట్ల వివరాలతో అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో సరిపోల్చుతారని చెప్పారు. ఎన్నికల ప్రక్రియలోని ప్రతి దశలో అభ్యర్థులు, వారి ప్రతినిధులకు పరిశీలించే అవకాశం ఉండటం వల్లే వ్యవస్థ పారదర్శకంగా కొనసాగుతోందని వివరించారు.

### ఓటర్ల జాబితాల స్వచ్ఛతకు ప్రత్యేక చర్యలు

ఓటర్ల జాబితాల స్వచ్ఛత, కచ్చితత్వాన్ని కాపాడేందుకు ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను చేపడుతోందని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. ఈ ప్రక్రియలో బీఎల్ఓల పాత్ర అత్యంత కీలకమని చెప్పారు. బీఎల్ఓలు తమకు సమయం దొరికినప్పుడల్లా సంబంధిత ప్రాంతంలోని ఓటర్ల జాబితాను పరిశీలించాలని సూచించారు. అర్హులైన యువ ఓటర్ల పేర్లను చేర్చేందుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. దేశ ప్రజాస్వామ్యానికి ఇది అందించగల గొప్ప సేవల్లో ఒకటని అన్నారు.

### యువతకు 'ఈసీఐనెట్'పై అవగాహన

అహ్మదాబాద్‌లో జరిగిన 'ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ అండ్ ఈసీఐనెట్' ఐదో ప్రాంతీయ సదస్సులోనూ సీఈసీ పాల్గొన్నారు. యువతలో ఎన్నికల అవగాహన, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించడంపై ఈ సమావేశంలో చర్చించారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, తమ కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల ప్రజలకు ఓటర్ల జాబితాలో కొత్తగా పేర్లు నమోదు చేసుకునే విషయంలో సహకరించాలని జ్ఞానేశ్ కుమార్ సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లు యువతలో ప్రజాస్వామ్య విలువలను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు.

## బ్రిక్స్‌లో భారత్ దౌత్య బలం చూపించాలి

బ్రిక్స్ వేదికగా భారత్ తన దౌత్య బలాన్ని మరోసారి చాటుకోవాలని కాంగ్రెస్ కోరింది. ప్రపంచ దేశాల్లో ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాల్లో భారత్‌పై ఉన్న నమ్మకాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొంది. బ్రిక్స్ సదస్సు ప్రారంభమైన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పలు సూచనలు చేసింది. సంక్షోభ సమయాల్లో భారత్ నమ్మకమైన, నిర్మాణాత్మక భాగస్వామిగా నిలవాలని కాంగ్రెస్ విదేశీ వ్యవహారాల విభాగం చీఫ్ సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. భారత్ గతంలో అంతర్జాతీయ వ్యవహారాల్లో ప్రత్యేకమైన దౌత్య స్థానం కలిగి ఉండేదని కాంగ్రెస్ పేర్కొంది. ఇప్పుడు ఆ స్థానం, దౌత్యపరమైన ప్రభావాన్ని తిరిగి సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలని సూచించింది. గ్లోబల్ సౌత్‌కు భారత్ గొంతుకగా ఉంటుందని చెప్పడం మాత్రమే కాకుండా అందుకు తగ్గట్టుగా చర్యలు కూడా ఉండాలని ఖుర్షీద్ అన్నారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో బ్రిక్స్ సభ్య దేశాల మధ్య విభేదాలు కనిపిస్తున్నాయని కాంగ్రెస్ తెలిపింది. ముఖ్యంగా బ్రిక్స్ సభ్య దేశమైన ఇరాన్‌పై జరిగిన దాడుల విషయంలో భారత్ వైఖరిపై కొన్ని వర్గాల్లో అనుమానాలు ఉన్నాయని పేర్కొంది. ఆ అనుమానాలను నివృత్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరింది. పశ్చిమాసియా యుద్ధంలో భారత్ దౌత్యపరమైన పాత్ర పరిమితంగా ఉందని విమర్శించింది. బ్రిక్స్ దేశాల మధ్య ఏకాభిప్రాయం తీసుకురావడంలో కూడా ప్రభుత్వం తగినంత ప్రయత్నం చేయలేదని ఆరోపించింది. అదే సమయంలో దౌత్యపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొన్న బ్రిక్స్ వ్యవస్థాపక సభ్య దేశం దక్షిణాఫ్రికాకు భారత్ నుంచి మరింత మద్దతు ఉండాల్సిందని పేర్కొంది.

### బ్లాక్ రాజకీయాలకు దూరంగా!

ప్రస్తుత బ్రిక్స్ సదస్సును భారత్ దౌత్య నైపుణ్యాన్ని చూపించేందుకు ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ సూచించింది. సభ్య దేశాల మధ్య ఐక్యత పెంచాలి కానీ బ్రిక్స్‌ను మరో అంతర్జాతీయ బ్లాక్‌గా మార్చే రాజకీయాలకు దూరంగా ఉండాలని పేర్కొంది. ప్రపంచ వ్యవస్థలో విభేదాలు పెరుగుతున్న సమయంలో బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ కోరింది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య వాణిజ్యం, ఆర్థిక సహకారం, సరఫరా వ్యవస్థలు, అనుసంధానం వంటి అంశాల్లో భారత్ ముందుండాలని సూచించింది. భారత్ తన ప్రయోజనాలను బలంగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు న్యాయమైన ప్రపంచ వ్యవస్థ కోసం పనిచేసే దేశాలకు నమ్మకమైన భాగస్వామిగా ఉండాలని కాంగ్రెస్ తెలిపింది. గ్లోబల్ సౌత్, గ్లోబల్ నార్త్ మధ్య భారత్ ఒక విశ్వసనీయమైన వారధిగా వ్యవహరించాలని పేర్కొంది. బ్రిక్స్ దేశాలు ప్రపంచ వస్తు వాణిజ్యంలో 19.6 శాతం వాటా కలిగి ఉన్నాయని ఖుర్షీద్ తెలిపారు. అయితే బ్రిక్స్ దేశాలతో భారత్ వాణిజ్య సంబంధాలు సమతూకంగా లేవని అన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ ఉపయోగించుకోవాలని సూచించారు. భారత వస్తువులు, సేవలకు మరింత మార్కెట్ అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కోరింది. ఇతర దేశాల్లో భారత కంపెనీలు ఎదుర్కొంటున్న వాణిజ్య అడ్డంకులను తగ్గించాలని పేర్కొంది. అదే సమయంలో భారత సంస్థలకు పోటీ చేసేందుకు న్యాయమైన, స్పష్టమైన అవకాశాలు కల్పించాలని సూచించింది. బ్రిక్స్ పే వ్యవస్థపై జరుగుతున్న ప్రయత్నాలను కాంగ్రెస్ స్వాగతించింది. సరఫరా వ్యవస్థలు, అనుసంధానంపై కూడా సభ్య దేశాల మధ్య ఒప్పందాలు కుదరాలని కోరింది. 2014లో ఏర్పాటు చేసిన కాంటింజెంట్ రిజర్వ్ అరేంజ్‌మెంట్‌ను మరింత సమర్థంగా అమలు చేయాలని సూచించింది. ఇందులో భారత్ 18 బిలియన్ డాలర్ల నిధులకు హామీ ఇచ్చిందని ఖుర్షీద్ గుర్తు చేశారు.

### ఐరాసలో శాశ్వత సభ్యత్వం

భారత్ దీర్ఘకాలంగా కోరుతున్న ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి బ్రిక్స్ దేశాల మద్దతు పొందేందుకు ప్రయత్నించాలని కాంగ్రెస్ తెలిపింది. 2021లో భారత్ బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన సమయంలో తీసుకున్న నిర్ణయాల ముందుకు వెళ్లేలా చూడాలని కోరింది. అంతేకాదు బ్రిక్స్ సదస్సులో ఏం చర్చించారు? ఏ నిర్ణయాలు తీసుకున్నారు? అనే విషయాలను దేశ ప్రజలకు వివరించేందుకు ప్రధాని మోదీ ప్రెస్‌మీట్ నిర్వహించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. గతంలో జవహర్‌లాల్ నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు భారత్ అంతర్జాతీయ వ్యవహారాల్లో స్వతంత్ర వైఖరితో వ్యవహరించిందని కాంగ్రెస్ పేర్కొంది. పశ్చిమాసియా, దక్షిణాఫ్రికాలో వర్ణవివక్ష వ్యతిరేక పోరాటం, వలస పాలనకు వ్యతిరేకంగా భారత్ తీసుకున్న వైఖరిని ఇందుకు ఉదాహరణలుగా చూపింది. భారత్ తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటూనే, ప్రపంచ వేదికపై నైతిక నాయకత్వం, వ్యూహాత్మక స్పష్టతను చూపించాల్సిన సమయం ఇదేనని కాంగ్రెస్ పేర్కొంది. బ్రిక్స్‌ను భద్రత, ఆర్థికాభివృద్ధి, సమానత్వం కోసం మరింత ప్రభావవంతమైన వేదికగా మార్చేందుకు భారత్ కీలక పాత్ర పోషించాలని కోరింది

## ముంబయి ఉగ్రదాడుల సూత్రధారిపై మళ్లీ నాన్ బెయిలబుల్ వారెంట్

ముంబయి ఉగ్రదాడుల సూత్రధారి, లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌పై మరోసారి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. భారత్‌లో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల్లో ఒకడిగా ఉన్న హాఫీజ్ సయీద్ ప్రస్తుతం పాకిస్థాన్‌లోనే ఉన్నాడని జాతీయ దర్యాప్తు సంస్థ జమ్మూలోని ప్రత్యేక కోర్టుకు తెలిపింది. కశ్మీర్ లోయలో పనిచేస్తున్న ఉగ్రవాదులకు ఆయుధాలు, డబ్బు, ఆదేశాలు అందిస్తున్నాడని ఆరోపించింది.



హాఫీజ్ సయీద్‌పై రెండు నెలల వ్యవధిలోనే జమ్మూలోని ప్రత్యేక చీ×ూా కోర్టు రెండోసారి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయడం ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది. సెప్టెంబర్ 8న ఆ కేసును విచారించిన ప్రత్యేక న్యాయమూర్తి ప్రేమ్ సాగర్, దర్యాప్తులో హాఫీజ్ సయీద్ ప్రమేయం బయటపడిందని, అతడు ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొంటూ వారెంట్ జారీ చేశారు.

### కేసు అసలు ఎలా బయటపడిందంటే?

ఈ ఏడాది ప్రారంభంలో శ్రీనగర్ శివార్లలోని పాండచ్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో మహమ్మద్ నఖీబ్ భట్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద చైనాలో తయారైన ఓ గ్రెనేడ్‌తో పాటు 15 లైవ్ రౌండ్లు లభించాయి. దీంతో బట్‌పొరాకు చెందిన మహమ్మద్ నఖీబ్ భట్‌పై కేసు నమోదు చేశారు. జకూరా పోలీస్ స్టేషన్‌లో అతడిపై చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం ఆయుధాల చట్టం, పేలుడు పదార్థాల చట్టం కింద కేసులు నమోదయ్యాయి. ఈ కేసుపై దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ కశ్మీర్‌లో పనిచేస్తున్న ఓ పెద్ద ఉగ్ర నెట్‌వర్క్ వెలుగులోకి వచ్చింది. దర్యాప్తులో లష్కరే తోయిబాతో పాటు దాని అనుబంధ సంస్థగా పేర్కొంటున్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ తో సంబంధాలున్న పలువురిని అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తులు కూడా ఉన్నారు.

### హాఫీజ్ సయీద్ పేరు ఎలా వచ్చింది?

ఈ దర్యాప్తులోనే హాఫీజ్ సయీద్ పేరు బయటకు వచ్చిందని చీ×ూా కోర్టుకు తెలిపింది. నిషేధిత ఉగ్ర సంస్థ లష్కరే తోయిబాకు హాఫీజ్ సయీద్ అమీర్, చీఫ్, ఫౌండర్?గా వ్యవహరిస్తున్నాడని దర్యాప్తు సంస్థ పేర్కొంది. అరెస్టయిన పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులకు అతడితో సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని తెలిపింది. కశ్మీర్ లోయలో పనిచేస్తున్న ఉగ్రవాదులకు హాఫీజ్ సయీద్ పాకిస్థాన్ నుంచి సహాయం అందిస్తున్నాడని చీ×ూా ఆరోపించింది. ఆయుధాలు, నిధులు సమకూర్చడంతో పాటు ఉగ్రవాదులకు అవసరమైన ఆదేశాలను కూడా ఇస్తున్నాడని కోర్టుకు వివరించింది. అతడు పాకిస్థాన్‌లోనే ఉన్నాడని సమాచారం ఉందని, ఉద్దేశపూర్వకంగానే భారత్‌కు దూరంగా ఉంటూ అరెస్టు నుంచి తప్పించుకుంటున్నాడని చీ×ూా తెలిపింది. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లోని సర్గోధాకు చెందిన వ్యక్తిగా హాఫీజ్ సయీద్‌ను చీ×ూా తన దరఖాస్తులో పేర్కొంది.

నవగీతం
తెలుగు దినపత్రిక

ఆదివారం
13 సెప్టెంబర్ 2026

# మేం కొత్తగా పెట్టిందేమీ లేదు

-మొదటిపేజీ తరువాయి

పబ్లిక్‌డొమైన్‌లో పెట్టాలని, కోర్టుకు కూడా కాపీ ఇవ్వాలని, అన్ని జిల్లాల్లో ఇవ్వాలని, 22ఏ జాబితా నుంచి భూములను తొలగించాలంటే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని కోర్టు సూచించింది. దీంతో కమిటీ ఏర్పాటు చేయడమే కాకుండా డిసెంబర్ 3, 2025న ఈ జాబితాను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాం. అయితే, తక్కువ సమయం ఉన్నందున జీవో 121, ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన సమయంలో ఏ భూములు ఈ జాబితాలో ఉన్నాయో వాటిని అప్‌డేట్ చేయకుండా అదే కాపీని అప్‌లోడ్ చేశాం. స్వార్థం, స్వలాభం కోసం చేసింది కాదు. తప్పు జరిగిన మాట వాస్తవం. దీనిపై నేను విచారం వ్యక్తం చేశాను. అయితే, యుద్ధ ప్రాతిపదికన సరిదిద్దుతున్నాం' అని రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. శనివారం అసెంబ్లీలో 22ఏ భూములపై స్వల్పకాలిక చర్చను పొంగులేటి ప్రారంభించారు. ఈ సందర్భంగా మూడున్నర గంటల పాటు ప్రసంగించారు. చేయాల్సింది చేసి, కొల్లగొట్టాల్సింది కొల్లగొట్టి నంగనాచిల్లా మాట్లాడుతున్నారని, దొంగే పోలీసును దొంగా దొంగా అన్నట్టుగా బీఆర్‌ఎస్ వైఖరి ఉందని ధ్వజమెత్తారు.

### 47,400 ఎకరాలు తగ్గింది

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యే నాటికి 220 జాబితాలో 1,02,52,690 ఎకరాల భూమి ఉంటే, 2026 ఆగస్టు 31 నాటికి 1,02,05,250 ఎకరాలు ఉందని చెప్పారు. అంటే 47,400 ఎకరాలు తగ్గిందని, ఇంకా తాము లక్షల ఎకరాలు కొత్తగా ఈ జాబితాలో చేర్చింది ఎక్కడని నిలదీశారు. రాష్ట్రం ఏర్పాటయ్యే నాటికి 1,95,812 ఎకరాల వ్యవసాయేతర భూములు 22ఏ జాబితాలో ఉంటే ఇప్పుడు 1,94,543 ఎకరాలున్నాయని, దాదాపు 800 ఎకరాలు తగ్గితే తాము కొత్తగా ఏం చేరుస్తామని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి తొలగించిన ప్రతి అంగుళం భూమికి కాగితాలున్నాయని, టీఎం--15 మాడ్యూల్ ద్వారా ప్రజల పట్టా భూములైన 23వేల ఎకరాలను వారికి ఇచ్చేశామని, జీవోలు, మెమోల ద్వారా మరో 20వేల ఎకరాలు ప్రజలకే ఇచ్చామన్నారు. అయితే, బీఆర్‌ఎస్ హయాంలో ఈ జాబితా నుంచి తొలగించిన 23వేల ఎకరాల భూమికి కాగితాల్లేవని కమిటీ చెప్పిందన్నారు. 22ఏ జాబితా కారణంగా రిజిస్ట్రేషన్లు తగ్గాయని అనడంలో వాస్తవం లేదన్నారు. ఈ విషయంలో బీఆర్‌ఎస్, బీజేపీలు ఒక్కటేనని, ఇక్కడ పలికే చిలుకలు మాత్రమే వేరని, కానీ పలుకులు మాత్రం ఒకటేనన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు, ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలు ఒకే తరహాలో మాట్లాడిన మాటలను స్పీకర్ అనుమతితో సభకు వీడియో ద్వారా వినిపించారు.

### శకుని మామ చేసి ఉంటే..

'అగిపెట్టెల అబద్ధాల రావు, శకుని మామ తొమ్మిదిన్నరేళ్లు అధికారంలో ఉన్నారు. అప్పుడే వారు ఈ జాబితాను సరిచేసి ఉంటే ఇప్పుడు సమస్య వచ్చేది కాదు. వారు తెచ్చిన ధరణి కారణంగా ఎంతో మంది ఆత్మహత్యల పాలయ్యారు. ఇప్పుడేదో మాట్లాడుతున్నారు. మనిషి రక్తం మరిగిన పులి మళ్లీ మళ్లీ తిరిగినట్టు అధికారం కోసం దోచుకోవడం కోసం నోరు తెరిస్తే అబద్ధాలాడుతున్నారు. కానీ ఆ పులికి తెలియదు.. వచ్చి రేవంత్‌రెడ్డి అనే బోనులో పడతాడని. ముక్కుతాడు వేసి కట్టేస్తాడని తెలియదు. నిద్ర పట్టని రాత్రులు గడుపుతూ రోడ్డెక్కి ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. 22ఏ జాబితాతో రాష్ట్రం అతలాకుతలమవుతున్నప్పుడు పిల్లకాకులు అరవడమెందుకు? ప్రధాన ప్రతిపక్ష నేత వచ్చి మాట్లాడొచ్చు కదా? సలహాలు ఇవ్వచ్చు కదా? వసతులు, ఏర్పాట్లు కావాలి కానీ ప్రజలకు సమస్య వచ్చినప్పుడు కనుచూపు మేరలో కనిపించవా? నువ్వున్నప్పుడు నేను మాట్లాడాలనే కోరిక అలానే మిగిలిపోయేట్టుంది' అని పొంగులేటి చెప్పారు.

### మొహం చాటేయడం అలవాటే..

22ఏ జాబితాలో ఉన్న భూములను చూపెట్టి పేదల కడుపుకొట్టారని, అందుకే సమాధానం చెప్పాల్సి వస్తుందని సభలో గందరగోళం సృష్టించి ప్లాన్ ప్రకారం పారిపోయారని పొంగులేటి అన్నారు. అయితే, చర్చకు మొహం చాటేయడం వారికి అలవాటేనని, సభ నుంచి వారు పారిపోయినా ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఇప్పుడు 22ఏ జాబితా కారణంగా అక్కడక్కడా ప్రజలు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమే అని, కానీ ధరణిని అమల్లోకి తెచ్చినప్పుడు మూడు నెలల పాటు అసలు రిజిస్ట్రేషన్లనే నిలిపివేశారని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చే నాటికి 387 గ్రామాలకు నక్షాల్లేవని, ఆయా గ్రామాల్లో సర్వే చేసి భూముల సమస్యలు తీరుస్తున్నామని చెప్పారు. ఇందుకోసం మొదటి దశలో భాగంగా 70 రోవర్లు కొనుగోలు చేశామని, 32 జిల్లాల్లోని 70 చొప్పున గ్రామాల్లో తొలిదశలో పైలట్ సర్వే చేస్తున్నామన్నారు. నవంబర్ చివరికల్లా ఈ సర్వే పూర్తవుతుందని అన్నారు.

### 23వేల ఎకరాలు అక్రమంగా బదిలీ

ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని వారు చేసిన అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిటింగ్ నిర్వహిస్తే అనేక భయంకర విషయాలు వెలుగులోనికి వచ్చాయని పొంగులేటి చెప్పారు. పైలట్‌లో భాగంగా సిద్ధిపేట, సిరిసిల్లలో ఆడిట్ చేస్తే 23వేల ఎకరాల భూమిని 13వేల ఖాతాలకు బదిలీ చేసినట్టు తేలిందన్నారు. ఏ భూమి ఎవరి ఖాతాలోకి వెళ్లింది.. విదేశాల్లో జరిగిన లావాదేవీలేంటి? అక్కడ కట్టుకున్న హోటళ్ల వివరాలను ప్రత్యేక విచారణ బృందం (సెట్)కు పంపామని తెలిపారు. అధికారం పోయిన తర్వాత కూడా అధికారంలోనే ఉన్నామని భ్రమపడుతూ, పాత వ్యవస్థలను ఉపయోగించుకుని పేదల భూములను కొల్లగొట్టాలనే ఆలోచనలను మానుకోవాలని హితవు పలికారు. అసలు 22ఏ భూముల విషయంలో కొన్ని సమస్యలను గుర్తించామని, వాటిపై సభ సూచన మేరకు త్వరలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పొంగులేటి వెల్లడించారు. యూఎల్‌సీ భూములు, జీహెచ్‌ఎంసీతో పాటు హెచ్‌ఎండీఏ, డీటీసీపీలు అనుమతిలిచ్చిన లేఅవుట్లు, జీవో 59, జీవో 118, అసైన్డ్ భూముల్లో కట్టుకున్న ఇళ్లు, ఇందిరమ్మ హౌసింగ్ కింద కేటాయించిన ఇంటి స్థలాలు, నాలా మార్పిడి కాని భూములు, ప్రభుత్వ భూముల్లో అనధికారిక లేఅవుట్ల విషయంలో సమస్యలున్నాయని, వీటిని సభ నిర్ణయం మేరకు పరిష్కరించడానికి ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవని పొంగులేటి స్పష్టం చేశారు.

### ధరణి దందాతో రూ.లక్షల కోట్లు కొల్లగొట్టారు...

--ఎన్నికల్లో ఖర్చుకు వాడారు
--హరీశ్‌రావు సొంత మామకు ప్రభుత్వ భూమిని కట్టబెట్టించారు
--ఇలా పొందినవారిలో పల్లా రాజేశ్వరరెడ్డి, గంగుల కమలాకర్ ఉన్నారు

ధరణి పోర్టల్‌ను అట్టుపెట్టుకుని బీఆర్‌ఎస్ పెద్దలు రూ.లక్షల కోట్లు కొల్లగొట్టారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. అలా వచ్చిన డబ్బును గత ఎన్నికల్లో ఖర్చు కోసం వాడుకున్నారన్నారు. ఎకరాల కొద్దీ భూమిని నిషేధిత జాబితా నుంచి తప్పించి పట్టా భూములుగా మార్చి విక్రయించి భారీగా డబ్బు పోగు చేసుకున్నారన్నారు. అలాంటి లావాదేవీలకు సంబంధించి తమ ప్రభుత్వం గుర్తించిన భూములను తిరిగి నిషేధిత జాబితాలోకి చేరుస్తూ, అవి పేదలకు దక్కేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 22ఏకు సంబంధించి శాసనసభలో జరిగిన స్వల్పకాలిక చర్చను ప్రారంభిస్తూ ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్, మేనల్లుడు హరీశ్‌రావులను ప్రధాన పాత్రధారులుగా పేర్కొంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను శకుని మామ అని, హరీశ్‌రావును అగ్గిపెట్టెల అబద్ధాల రావు, అని కేటీఆర్‌ను డ్రామాల వ్యక్తి అంటూ పదేపదే సంబోధించారు.

### ఉదాహరణలతో సభ ముందు...

ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని అసైన్‌మెంట్, భూదాన్ భూములను నిషేధిత జాబితా నుంచి తప్పించి పట్టా భూములుగా మార్చి ప్రైవేట్ పరం చేశారంటూ మచ్చుకు కొన్ని ఉదంతాలుగా సభ దృష్టికి తెచ్చారు. పొంగులేటి మాటల్లోనే... 'సిద్దిపేట జిల్లా కొండపాక మండలం వెలికట్ట గ్రామంలో సర్వే నెం.271లో 327.09 ఎకరాల ప్రభుత్వం భూమిని గతంలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పట్టాల కోసం కేటాయించింది. ఇందులో 6.18 ఎకరాల భూమిని గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న హరీశ్‌రావు తన సొంత మామ (భార్య తండ్రి) హన్మంతరావుకు కట్టబెట్టించారు. ఇందులో కొంత భూమికి సంబంధించి మిషన్ భగీరథ పరిహారం కూడా పొందారు.

మెదక్ జిల్లా శివంపేట మండలం సిక్లిందాపూర్ గ్రామంలో సర్వే నెం.33 నుంచి 87 వరకు ఉన్న 569.05 ప్రభుత్వ భూమిలో 2023 అక్టోబరు 5న 372.32 ఎకరాలకు సంబంధించి ఆక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికెట్ (ఓఆర్‌సీ) జారీ చేశారు. దాన్ని మొత్తంగా స్వాహా చేశారు. ఆ రూపంలో పోగుచేసుకున్న రూ.కోట్ల మొత్తాన్ని ఎన్నికల ఖర్చుగా వినియోగించారు.

మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిప్పలతుర్తి గ్రామ సర్వే నం.58, 59లో ఉన్న 476.30 ఎకరాలు ప్రభుత్వం భూమిలో.... 112.21 ఎకరాల భూమిని 22ఏ జాబితా నుంచి తప్పించి ఓ కుటుంబంలోని సభ్యుల పేర్లతో ఓఆర్‌సీ జారీ చేశారు. ఇక్కడే 195.25 ఎకరాలను కూడా నిషేధిత జాబితా నుంచి తొలగించి పట్టాలు జారీ చేసే సమయంలో కొందరు పసిగట్టి ఏసీబీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఆ బాగోతం వికటించి తిరిగి ఆ భూములు నిషేధిత జాబితాలోకి చేరాయి. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగుల పల్లి గ్రామంలో సర్వే నం. 186 నుంచి 189లో ఉన్న 29.27 ఎకరాల భూదాన్ భూమి ఉండగా, దాన్ని పట్టా భూమిగా కన్వర్ట్ చేయించారు. ఇందులో 24.27 ఎకరాలను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, మరో ఇద్దరి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ భూమి ప్రస్తుత విలువ రూ.3 వేల కోట్ల వరకు ఉంటుంది. ఇప్పుడు దీన్ని మేము తిరిగి నిషేధిత జాబితాలో చేర్చాం.

? ఇదే గ్రామం శంకర్‌హిల్స్ ఏరియాలోని సర్వే నం. 111--191 లోని 460 ఎకరాల భూమికి పట్టాదారులు గతంలో ఓ ప్రైవేటు సంస్థకు జీపీఏ ఇచ్చారు. దాన్ని ఆ సంస్థ 3,333 ప్లాట్లుగా విడదీసి విక్రయిస్తోంది. మరోవైపు ఆ భూమిని మరో సంస్థకు మరోసారి జీపీఏ చేశారు. ఆ సంస్థ ఎకరాల రూపంలో విక్రయిస్తోంది. దీనిపై కొందరు కోర్టుకు వెళ్లగా స్టేటస్‌కో జారీ అయింది. 2022లో నాటి ప్రభుత్వం ఆ భూమిని నిషేధిత జాబితాలో పెట్టింది. తర్వాత 226.06 ఎకరాలను ఆ తర్వాత నిషేధిత జాబితా నుంచి తప్పించి ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేశారు. అలా పొందినవారిలో బీఆర్‌ఎస్ నేత గంగుల కమలాకర్ కూడా ఉన్నారు'

# పన్నుపై అపోహాలొద్దు

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లాలు రాష్ట్ర ఆర్థిక ఉత్పత్తిలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయని వివరించారు. శనివారం మధ్యాహ్నం తర్వాత శ్రీధర్‌బాబు బిల్లుపై జరిగిన చర్చలో పలు పార్టీల సభ్యులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. బిల్లులో పెట్టిన 20 శాతాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం మేరకు 10 శాతానికి తగ్గిస్తున్నట్టు చెప్పారు. ఔటర్ రింగ్‌రోడ్డు వరకు విస్తరించిన హైదరాబాద్ నగరాన్ని పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి చైర్మన్‌గా ప్రత్యేక కార్యనిర్వాహక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, వరదల నివారణ, చెత్త నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో వివిధ సంస్థలు, శాఖల మధ్య సమన్వయం అవసరమన్నారు. భవిష్యత్‌లో నగర అవసరాలకు అనుగుణంగా ఈ వ్యవస్థ పనిచేసేలా క్యూర్ చట్టాన్ని రూపొందిస్తున్నట్లు వివరించారు. అనంతరం బిల్లు ఆమోదానికి ప్రతిపాదించిన సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా ఈ అంశాన్ని వివరించారు. పన్నుల పెరుగుదలను 20 నుంచి 10 శాతానికి తగ్గిస్తూ బిల్లులో సవరణ చేయాలని సీఎం చేసిన ప్రతిపాదనను సభ ముందు ఆమోదానికి పెట్టారు. ఈ సవరణతోపాటు క్యూర్ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది.

### ఎంఐఎం, బీజేపీ ఏకాభిప్రాయం

పాల్వాయి హరీశ్‌బాబు (బీజేపీ) లేవనెత్తిన అంశాన్ని ప్రస్తావిస్తూ కోర్ రీజియన్‌లో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పాటు చేసే అపెక్స్ కౌన్సిల్ కేవలం విధాన నిర్ణయాల కోసమేనని, ఈ సమావేశాలకు అవసరమైతే మేయర్లను ఆహ్వానిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. ఈ కౌన్సిల్ ఏర్పాటు ద్వారా మేయర్లు, కార్పొరేటర్ల స్థానిక అధికారాలపై ఎలాంటి ప్రభావం ఉండబోదని వివరించారు. ఇందుకు విభేదించిన హరీశ్‌బాబు అపెక్స్ కౌన్సిల్‌కు మేయర్లను రమ్మనకపోతే వారికి ఇంకేం అధికారాలుంటాయని ప్రశ్నించారు. ఎంఐఎం సభ్యుడు జుల్ఫికర్ అలీ జోక్యం చేసుకుంటూ.. అపెక్స్ కౌన్సిల్ సమావేశాలకు మేయర్లను ఆహ్వానించాల్సిందేనని డిమాండ్ చేశారు. దీంతో పాల్వాయి హరీశ్‌బాబు బల్లలు చరిచి మరీ అభినందించారు. ఎంఐఎం సభ్యుడు కూడా అదే చెబుతున్నాడంటూ అధికార పక్షానికి చూపెట్టే ప్రయత్నం చేశారు. వెంటనే శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుంటూ... జుల్ఫికర్ అలీని హరీశ్‌బాబు గైడ్ చేస్తున్నారని, అందుకే ఆయన ఆ కోణంలో మాట్లాడుతున్నారని బదులిచ్చారు. మూడు కార్పొరేషన్లను నియంత్రించేందుకు అపెక్స్ కౌన్సిల్ ఏర్పాటు చేయడం లేదని, ఈ కౌన్సిల్ విశాల దృక్పథంతో పనిచేస్తుందని వివరణ ఇచ్చారు.

### ప్రజలపై తీవ్ర భారం: అక్బరుద్దీన్

క్యూర్ బిల్లులోని పలు అంశాలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని, బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ తీవ్ర అభ్యంతరం తెలిపారు. బిల్లు న్యాయస్థానాల్లో నిలవదని, సెలక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేశారు. క్యూర్ పరిధిలోని కార్పొరేషన్ల మేయర్, డిప్యూటీ మేయర్ల అధికారాలకు కత్తెరేసి కీలక అధికారాలను క్యూర్ అపెక్స్ కౌన్సిల్‌కు, పురపాలక, పట్టణాభివృద్ధి ముఖ్యకార్యదర్శి నేతృత్వంలోని క్యూర్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి అప్పజెప్పారని తప్పుబట్టారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులకు అధికారాలు అప్పజెప్పకపోతే ఎన్నికలు నిర్వహించి ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న వార్షిక అద్దె విలువకి బదులుగా ప్రభుత్వం నిర్ణయించే మార్కెట్ విలువ ఆధారంగా ఆస్తి పన్నులను విధించాలని బిల్లులో పొందుపర్చడం పట్ల అభ్యంతరం తెలిపారు. స్థలం, భవనం మార్కెట్ విలువలను కలిపి ఆస్తి పన్నులు విధిస్తే నగర ప్రజలపై తీవ్ర భారం పడుతుందని తప్పుబట్టారు. ఏటా 20 శాతం ఆస్తి పన్నులు పెంచాలని బిల్లులో ప్రతిపాదించడాన్ని వ్యతిరేకించారు. ఆస్తుల మ్యుటేషన్ చేసుకున్న మాత్రాన వాటిపై హక్కులు రావని బిల్లులో పెట్టారని తప్పుబట్టారు. మరో ఆరు నెలల్లో మూడు కార్పొరేషన్ల ఎన్నికలకు వెళ్లనున్న నేపథ్యంలో ఈ బిల్లుతో ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. హైదరాబాద్‌లో భూగర్భ కేబుల్ వ్యవస్థ ఏర్పాటుకి సంబంధించిన రూ.1,400 కోట్లు విలువైన కాంట్రాక్టును ఒకే కంపెనీకి ప్రభుత్వం ఇవ్వడాన్ని అక్బరుద్దీన్ ప్రశ్నించారు. బిల్లుపై బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే రాజాసింగ్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉత్తమ్ పద్మావతిరెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, నవీన్‌యాదవ్ సైతం మాట్లాడారు.

### కోర్టుల్లో నిలబడదు: పాల్వాయి హరీశ్

'క్యూర్'చట్టం న్యాయస్థానం ముందు నిలబడదని, దానిని ఉపసంహరించుకోవాలని బీజేపీ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. ఈ బిల్లుకు తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకమన్నారు. ఈ చట్టం అమలులోకి వస్తే... మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లకు ఎలాంటి అధికారాలు ఉండవని, సీఎంకు అపరిమిత అధికారాలను కట్టబెడ్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లుకు సంబంధించి 4,100 అభ్యంతరాలు వస్తే.. అందులో 3 వేలకు పైగా ఆస్తిపన్ను పెంపుదలపై ఆందోళన వ్యక్తమైందన్నారు.

### విశ్వనగరం ట్యాగ్ ఉండాలి: కూనంనేని సాంబశివరావు

వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌కు విశ్వనగరం ట్యాగ్ ఉండాలని, అందుకోసం అధికార వికేంద్రీకరణతో మరింత అద్భుత నగరంగా తీర్చిదిద్దాలని సీపీఐ పక్షనేత కూనంనేని సాంబశివరావు చెప్పారు. విశ్వనగరం ట్యాగ్ వస్తేనే.. పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తారన్నారు. విస్తీర్ణంలో మూడో స్థానంలో.. జనాభాలో ఏడో స్థానంలో మన రాజధాని ఉందన్నారు.

### మండలిలో క్యూర్ బిల్లు

జిల్లాల విభజన అంతా అశాస్త్రీయమే: శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: పది జిల్లాలున్న తెలంగాణ రాష్ట్రాన్ని 33 జిల్లాలుగా ఎలా విభజించారో బీఆర్‌ఎస్ నేతలు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. జిల్లాల విభజన పూర్తిగా అశాస్త్రీయంగా జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే క్యూర్ బిల్లును రూపొందించినట్లు వివరించారు. శాసనమండలిలో ఆయన క్యూర్ బిల్లును ప్రవేశపెట్టి మాట్లాడారు.

## అన్ని సౌకర్యాలు అందిస్తాం

-మొదటిపేజీ తరువాయి

సూచించారు. ఇందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలన్నారు. హైదరాబాద్ ప్రశాంతంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని అన్నారు. సమస్యలు ఏమున్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలి

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మండప నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలని సూచించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత సంప్రదాయాన్ని పునరుద్ధరించామన్నారు. సమస్యలు తెలుసుకునేందుకు స్వయంగా తానే సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. మండపాలకు అతిథులను ఆహ్వానిస్తే నిర్వాహకులు ఆ వివరాలు స్థానిక కమిషనరేట్?కు అందించాలని సూచించారు. ఊహించని పరిణామాలు జరిగినపుడు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు ఆ సమాచారం ఉపయోగపడుతుందని ఆయన వివరించారు.

### మండపాల సమాచారం ముందుగానే ఇవ్వాలి

ఎక్కడెక్కడ మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే సమాచారం అందిస్తే పోలీసులకు ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణకు సులభంగా ఉంటుందని రేవంత్ రెడ్డి అన్నారు. అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మల కుంటలు ఏర్పాటు చేసినట్లే గణేశ్ నిమజ్జనాలకు అనుగుణంగా నిర్మాణ సమయంలోనే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెరువుల వద్ద చుట్టూ క్రేన్స్ ఏర్పాటుకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ రివ్యూకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్?, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్ హాజరయ్యారు.

## ఎప్పటిలోగా తొలగిస్తారో చెప్పాలి

-మొదటిపేజీ తరువాయి

తొందరలో లిస్ట్ అప్‌లోడ్ చేయడం వల్ల తప్పు జరిగిందని పొంగులేటి ఒప్పుకున్నారన్నారు. తప్పు ఒప్పుకున్నప్పుడు బాధితులకు క్షమాపణ చెప్పి, సమస్యను ఎప్పటిలోగా పరిష్కరిస్తారో ప్రకటించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 22ఏ జాబితాలో ఎన్ని ఎకరాలు చేర్చారు, ఎన్ని తొలగించారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇల్లు జాబితా నుంచి తొలగించినట్టే ప్రజల భూములను కూడా జాబితా నుంచి తొలగించాలని హరీశ్‌రావు కోరారు.

### కాంగ్రెస్ సర్కారే భూమి, ఎన్‌వోసీ ఇచ్చింది..

తన కుటుంబ సభ్యులపై పొంగులేటి చేసిన ఆరోపణలను హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. తన మామ హన్మంతరావు రిటైర్డ్ బ్యాంకు అధికారి అని, ఆయన కొండపాకలో భూమి కబ్జా చేశారన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఎక్స్ సర్వీస్‌మన్ సత్యనారాయణకు 1995లో అప్పటి ప్రభుత్వం ఆ భూమిని కేటాయించిందని, 2010లో కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్‌వోసీ ఇచ్చిందని వివరించారు. ఆ ఎన్‌వోసీ ఆధారంగా తన మామ చెక్ ద్వారా డబ్బు చెల్లించి, అప్పటి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. భూమి కేటాయించి ఎన్‌వోసీ ఇచ్చిందీ కాంగ్రెస్... రిజిస్ట్రేషన్ చేసింది కూడా నాటి కాంగ్రెస్ ప్రభుత్వమే అని పేర్కొన్నారు. ఎకరం రూ.15 కోట్లు విలువ చేస్తుందని చెబుతూ, రూ.50 లక్షలకు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారంటూ పొంగులేటి చేసిన వ్యాఖ్యలు కూడా తప్పేనన్నారు. కొండపాక సిద్దిపేట నియోజకవర్గంలో కాకుండా గజ్వేల్ నియోజకవర్గంలో ఉందని, ఈ విషయంలోనూ మంత్రి తప్పుగా మాట్లాడారని పేర్కొన్నారు. నాదర్‌గుల్, ఖాజాగూడ భూములు, ఫీనిక్స్ కంపెనీ ఒప్పందం తదితర అంశాలపై తాను లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

### నిరూపిస్తే రాజీనామా చేస్తా: పల్లా

జనగామ, వట్టినాగులపల్లి భూముల వ్యవహారంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. వట్టినాగులపల్లిలో రూ.3 వేల కోట్ల విలువైన 29 ఎకరాల భూదాన్ భూమిని తాను తీసుకున్నానని పొంగులేటి ఆరోపించారని, ఇందులో వాస్తవం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందే తనకు ఎకరం పది గుంటల భూమికి అగ్రిమెంట్ జరిగిందని, రాష్ట్రం ఏర్పడిన తొలి నెలలోనే రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని తెలిపారు. ఇది భూదాన్ భూమి కాదని 2008లోనే కోర్టు స్పష్టం చేసిందన్నారు. తనకు ఉన్నది ఎకరం పది గుంటలేనని, 33 ఎకరాల్లో మైనంపల్లి సోదరులు ప్లాట్లు కొనుగోలు చేశారని, అందులో 8.10 ఎకరాలు మైనంపల్లి చంద్రశేఖర్ పేరున ఉన్నాయని, వాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తాను హరీశ్‌రావుతో కలిసి జనగామకు వెళ్లి ప్రభుత్వ అక్రమాలను బయటపెట్టినందుకే తనపై కక్ష పెంచుకున్నారని ఆరోపించారు. తన భూమిని 22ఏ జాబితాలో చేర్చి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, కోర్టు కూడా తన భూమి విషయంలో జోక్యం చేసుకోవద్దని చెప్పిందన్నారు. 29 ఎకరాల భూమి తనదని పొంగులేటి నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, నిరూపించలేకపోతే పొంగులేటి రాజీనామా చేస్తారా అని పల్లా సవాల్ విసిరారు.

## 12 గంటలు ఉత్త 'కోతలే'

**మహబూబ్‌నగర్:** ఎల్‌నినో, వర్షాభావంతో రాష్ట్రంలో ఈ వానాకాలం సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. వరుణుడు కరుణించకపోతాడా అనే ఆశతో వర్షాధారంగా సాగు చేసిన పంటలు ఇప్పటికే చేతికందకుండా పోయాయి. బోర్లు, బావుల కింద వేసినవి సైతం ఎండుముఖం పడుతుండటంతో రైతాంగం కన్నీరుమున్నీరవుతోంది. వ్యవసాయానికి త్రీఫేస్ కరెంట్ సరఫరాలో అప్రకటిత కోతలు అమలు చేస్తుండడమే ఇందుకు కారణం. నీళ్లున్నా, విద్యుత్ కోతలతో తడులందించలేని దుస్థితిలో పలు ప్రాంతాల్లో రైతులు రోడ్డెక్కుతున్నారు.

### దాదాపుగా 5 నుంచి 8 గంటలు మాత్రమే..

రాష్ట్రంలో ఈ వానాకాలం సీజన్‌లో మొత్తంగా 1,19,55,375 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో వరి 50,92,817, పత్తి 48,21,503 ఎకరాల్లో సాగైనట్లు వ్యవసాయశాఖ నివేదికలు చెబుతున్నాయి. మొత్తం సాగులో వరి, పత్తి పంటల వాటా 82.9 శాతంగా ఉంది. అయితే వ్యవసాయానికి 12 గంటలపాటు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నా.. ఐదు నుంచి ఎనిమిది గంటలే ఇస్తున్నట్లు 'సాక్షి'బృందం పరిశీలనలో తేలింది. ఉదయం 5.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిరంతరాయంగా త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాల్సి ఉండగా.. దఫాల వారీగా అనధికారికంగా కోతలు అమలు చేస్తున్నారు. జిల్లాల వారీగా సరఫరా సమయాలతోపాటు కోతల సమయంలోనూ తేడాలు ఉన్నాయి.

### ఒక్కో జిల్లాలో ఒక్కోలా..

-- జోగుళాంబ గద్వాల జిల్లాలో జిల్లాలో వ్యవసాయానికి కేవలం ఐదారు గంటలు మాత్రమే త్రీఫేస్ కరెంట్ ఇస్తున్నారని.. అది కూడా లో ఓల్టేజీతో సరఫరా చేస్తుండడంతో మోటార్లు కాలి పోతున్నాయి.

-- ఖమ్మం జిల్లాలో రోజుకు ఐదు నుంచి ఏడు గంటలే వ్యవసాయ విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రాంతాల వారీగా ఉదయం 8 నుంచి 12 గంటల వరకు కోత పెడుతుండడంతో చివరి పంటకు నీరందడం లేదు. వేంసూర్ మండలంలో బోరుబావుల్లో నీళ్లున్నా.. తడులందకపోవడంతో పలువురు రైతులు ఎండిన వరిని తొలగించి.. జొన్న సాగు చేపట్టారు.

-- కామారెడ్డి జిల్లాలో రోజుకు ఆరు నుంచి ఏడు గంటలు మాత్రమే వ్యవసాయానికి త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. కరెంట్ ట్రిప్ కావడం, లోఓల్టేజీ సమస్యతో మోటార్లు తరచు కాలిపోతున్నాయని.. ఒకసారి మరమ్మతుకు వస్తే అదనంగా రూ.10 వేల వరకు ఖర్చు వస్తోందన్నారు.

-- నిజామాబాద్ జిల్లాలో ఉదయం 8, 9 గంటలకు మొదలై సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ కరెంట్ ఇస్తున్నారు. మధ్యమధ్యలో రెండు గంటల పాటు కోత పెడుతున్నారు.

-- ఉమ్మడి వరంగల్ జిల్లాలో వ్యవసాయ కరెంట్ ఉదయం 7.30 గంటలకు ఇస్తున్నారు. మధ్యమధ్యలో కోతలతో మొత్తం 8 గంటలపాటే సరఫరా చేస్తున్నట్లు రైతులు తెలిపారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
13 సెప్టెంబర్ 2026

## సంపాదకీయం

# ప్రైవేటీకరణ వివాదంలో ఇస్రో

ఇస్రో ప్రైవేటీకరణ అంశం చుట్టూ వివాదం రాజుకుంది.ఇస్రో ప్రైవేటీకరణ అంశంపై స్పష్టత ఇవ్వాలంటూ ఆ సంస్థకు చెందిన తొమ్మిది ఉద్యోగ సంఘాలు చైర్మన్‌కు లేఖ రాయడం ఈ అంశంపై చర్చకు దారితీసింది.అయితే, ఈ ప్రైవేటీకరణ అంశం 'నిరాధారమైనది' అని ఇస్రో చెబుతోంది.ఇదే విషయంపై ఇండియన్ నేషనల్ – స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ చైర్మన్ పవన్ కుమార్ గోయెంకా 'ఎక్స్'లో స్పందించారు.'భారత అంతరిక్ష రంగానికి ఇస్రో మూల స్తంభంగా ఉంటుంది" అని ఆయన చెప్పారు.న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌ఎస్‌ఐఎల్) తరఫున ఇస్రో తయారు చేసిన ఎన్నో సాంకేతికతలు వాణిజ్య అవసరాలకు వాడుకునేందుకు స్టార్టప్‌లకు బదిలీ అయ్యాయని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో అధికారిక సమాచారం ప్రకారం తెలుస్తోంది.అయితే, ప్రైవేటు సంస్థల కారణంగా భారత అంతరిక్ష రంగం అభివృద్ధికి ఊతం ఇచ్చినట్లవుతోందని స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ కో–ఫౌండర్ పవన్ కుమార్ చెప్పారు.సెప్టెంబరు 5న జీఎస్ఎల్వీ ద్వారా ఇస్రో జియో ఇమేజింగ్ శాటిలైట్స్‌ను ప్రయోగించింది. ఈ ప్రయోగం విజయవంతమైనట్లు ప్రకటించింది.ఇది జరిగిన కొన్ని గంటల తర్వాత ఇస్రోలోని తొమ్మిది ఉద్యోగ సంఘాలు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్‌కు బహిరంగ లేఖ రాశాయి.ప్రైవేటీకరణ, భవిష్యత్తులో ఇస్రో పాత్ర తదితర అంశాలను ప్రస్తావిస్తూ లేఖను విడుదల చేశారు ఉద్యోగులు.ఉద్యోగ సంఘాల తరఫున ఇస్రోలోని 5వేల మంది ఉద్యోగులకు తాము ప్రాతినిధ్యం వహిస్తున్నామని, మొత్తం 18,100 మంది ఉద్యోగులలో తమ సంఘాల ప్రతినిధులు 27శాతం మంది ఉన్నారని అందులో ప్రస్తావించారు.అసలు ఈ వివాదానికి ఆగస్టులో ఇన్–స్పేస్ చైర్మన్ పవన్ గోయెంకా చేసిన వ్యాఖ్యలు కీలకంగా మారాయి.రానున్న రోజుల్లో రాకెట్లు (లాంచ్ వెహికల్స్)ను ఇస్రో స్వయంగా తయారు చేయదు. వాటి తయారీ బాధ్యత ప్రైవేటు సంస్థలు లేదా ప్రభుత్వ రంగ సంస్థలకే అప్పగిస్తాం. ఇప్పటికే ఎస్ఎస్ఎల్వీ ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలోనే తయారువుతోంది.రోజువారీ ప్రయోగాలకు ఉపయోగించే లాంచ్ వెహికల్స్ కాకుండా ప్రత్యేక సందర్భాలు, పరిశోధనలు, ప్రత్యేక కక్ష్యలో ప్రవేశపెట్టే రాకెట్లను తయారు చేసే సాంకేతికతపై ఇస్రో దృష్టి పెడుతుంది. ఆ తర్వాత ఆ టెక్నాలజీని కూడా ప్రైవేటు రంగానికి బదిలీ చేస్తుంది" అని పవన్ గోయెంకా చెప్పారు.ఇప్పటికే 120 రకాల టెక్నాలజీలను ప్రైవేటు సెక్టార్‌కు బదిలీ చేశామని చెప్పారు పవన్ గోయెంకా.ఈ వ్యాఖ్యలు భారత అంతరిక్ష రంగంలో పెద్దఎత్తున చర్చకు దారి తీశాయి ఇస్రోను ప్రైవేటీకరిస్తారని లేదా దాని పాత్రను తగ్గించే ప్రయత్నం జరుగుతోందనే ఊహాగానాలు, తప్పుదోవ పట్టించే సమాచారం ప్రచారం జరుగుతోంది. ఇది పూర్తిగా తప్పు, నిరాధారం" అని ఇస్రో చెప్పింది.అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పెంచడమంటే ఇస్రో పాత్రను తగ్గించడం కాదని సంస్థ స్పష్టం చేసింది."భారత అంతరిక్ష రంగానికి నెక్స్ట్ జనరేషన్ సాంకేతికతల వృద్ధిపై ఇస్రోకు వీలు కల్పించాలన్నదే దీని ప్రధాన ఉద్దేశం" అని చెప్పింది.అంతరిక్ష రంగంలో భారత్ అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ప్రైవేటు రంగం కీలకమని స్కైరూట్ ఏరోస్పేస్ కో ఫౌండర్ పవన్ కుమార్ చందన చెప్పారు.భారత తొలి ప్రైవేటు ఆర్బిటాల్ రాకెట్ 'విక్రమ్ –1'ను స్కైరూట్ ఏరోస్పేస్ ఇటీవలే విజయవంతంగా ప్రయోగించింది."ఇస్రో, ప్రైవేటు స్పేస్ సెక్టార్‌లను కలిపే చూడాలి. అందులో ఇస్రో కీలకమైనది. ప్రైవేటు సెక్టార్ కంపెనీలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. ఈ రెండూ కలిస్తేనే భారత అంతరిక్ష రంగం ముందుకు సాగుతుంది" అని ఆయన చెప్పారు.కేంద్ర ప్రభుత్వం 2023లో 'ఇండియన్ స్పేస్ పాలసీ' తీసుకువచ్చింది. 2024 ఫిబ్రవరిలో స్పేస్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు కేంద్ర ప్రభుత్వం అనుమతించింది.ఆ తర్వాత అంతరిక్ష రంగంలో స్టార్టప్‌లు పెద్దఎత్తున వచ్చాయి. ప్రైవేటు కంపెనీల నియంత్రణ, ప్రోత్సాహకానికి ఇన్–స్పేస్ పనిచేస్తుంది.భారత్‌లో 2033 నాటికి స్పేస్ ఎకానమీ (అంతరిక్ష రంగ ఆర్థిక వ్యవస్థ) 45 బిలియన్ డాలర్ల (సుమారు 4,248,000 కోట్లు)కు చేరుకుంటుందని అంచనా. ఇందులో 11 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 1,038,000 కోట్లు )విలువైన ఎగుమతులు ఉంటాయని భారత్ అంచనా వేస్తోంది.ఈ ఏడాది జులై నాటికి భారత్ స్పేస్ ఏకానమీ సుమారు 8.4 బిలియన్ డాలర్లుగా ఉందని పీఐబీ వెల్లడించింది.2014లో ఒకే ఒక్క స్పేస్ టెక్నాలజీ స్టార్టప్ ఉండగా ఈ ఏడాది మార్చి 31 నాటికి భారత స్టార్టప్‌లలో పెట్టుబడులు 618.5 మిలియన్ యూఎస్ డాలర్లకు (సుమారు రూ. 58,340 కోట్లు) చేరుకున్నాయి.2021–22 లో ఈ పెట్టుబడులు 100.5 మిలియన్ డాలర్లు( సుమారు రూ. 9,480 కోట్లు) ఉండగా.. ఈ ఏడాది మార్చి నాటికి ఆరు రెట్లు పెరిగాయి.ఈ ఆగస్టు నాటికి భారత్‌లో 440 స్పేస్ టెక్నాలజీ స్టార్టప్‌లు రిజిస్టర్ అయినట్లు డీపీఐఐటీ స్టార్టప్ ఇండియా పోర్టల్ లెక్కలు చెబుతున్నాయని పీఐబీ రిపోర్టు చేసింది.ప్రస్తుతం భారత్‌లో ఉన్న స్పేస్ టెక్నాలజీ స్టార్టప్‌లలో 18 స్టార్టప్‌లతో పాటు 52 ప్రభుత్వేతర సంస్థలకు కలిపి అంతరిక్ష రంగ కార్యకలాపాలు నిర్వహించేందుకు 113 ఆథరైజేషన్స్ దక్కాయి."ప్రైవేటు సెక్టార్ పురోగతి అనేది భారత అంతరిక్ష రంగానికి 'బూస్ట్' అవుతుంది. వేలాది ఉద్యోగాలు వస్తాయి. గత మూడేళ్లలో 5వేల ఉద్యోగాలు రాగా, బిలియన్ డాలర్ల పెట్టుబడులు ప్రైవేటు స్పేస్ రంగంలోకి వచ్చాయని గణంకాలు స్పష్టం చేస్తున్నాయి" అని బీబీసీతో పవన్ కుమార్ చందన చెప్పారు.ఇస్రో వినియోగిస్తున్న యంత్రాలలో 80శాతం భాగాలు ప్రైవేటు కంపెనీలే తయారు చేస్తున్నాయని చెప్పారు పవన్ కుమార్ చందన.ఎస్ఎస్ఎల్వీ సాంకేతికతను 2025 సెప్టెంబరు 10న హెచ్ఏఎల్‌కు ఇస్రో, న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్), ఇన్–స్పేస్ సంయుక్తంగా బదలాయించాయి.ఇవి కాకుండా ఇస్రో, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ తయారు చేసిన దాదాపు 83 రకాల సాంకేతికతలను బదిలీ చేసేందుకు వివిధ సంస్థలతో ఇన్–స్పేస్ సమన్వయంతో 118 ఒప్పందాలు చేసుకుంది ఎన్ఎస్ఐఎల్.ఇందులో ఎస్ఎస్ఎల్వీ సాంకేతికత సహా ఇండియన్ మినీ శాటిలైట్–1 బస్, ఇస్రో లేజర్ గైరో (ఐఎల్జీ), ట్రై బ్యాండ్ (ఎస్, ఎక్స్, క) యాంటెన్నా ఫీడ్, సిరామిక్ సెర్వో యాక్సెలెరోమీటర్ వంటి సాంకేతికతలున్నాయి.2022లో అగ్నికుల్ కాస్మోస్, స్కైరూట్ ఏరోస్పేస్, పిక్సెల్ మొదలైన స్టార్ట్ ప్పులకు వివిధ టెక్నాలజీల బదలాయింపు మొదలవగా.. ఇప్పటికీ స్పేస్ రంగంలో స్టార్ట్‌అప్పులకు టెక్నాలజీ బదలాయింపు కొనసాగుతోంది.రానున్న సంవత్సరాల్లో కమర్షియల్ రాకెట్ల ప్రయోగానికి భారత్ సిద్ధమవుతోంది. ఇప్పటికే స్కైరూట్ ఏరో స్పేస్ 2022లో సబ్ ఆర్బిటాల్ రాకెట్, 2026లో ఆర్బిటాల్ రాకెట్లను ప్రయోగించింది.2026–27 ఆర్థిక సంవత్సరంలో రెండు రాకెట్ ప్రయోగాలు చేపట్టనున్నట్లు ఇన్–స్పేస్ ప్రకటించింది.అలాగే 2027–28 ఆర్థిక సంవత్సరంలో ఆరు ప్రైవేటు రాకెట్ ప్రయోగాలు చేపట్టాలని అంచనా కాగా, ఆయా ప్రయోగాలకు ఇంకా అనుమతులు రావాల్సి ఉందని ఇన్–స్పేస్ చెబుతోంది.

# జన జీవితాలలో కన్పించని జీడీపీ వృద్ధి

జనులు జీడీపీ అంకెలను భుజిస్తారా? అని ఒక విజ్ఞుడు ప్రశ్నించాడు. ఆ ప్రశ్న ఒక వ్యంగ్య ఛలోక్తి. నిజమే. ప్రజలు ఆహారాన్ని తింటారు, వస్త్రాలను ధరిస్తారు, పాదరక్షలు వేసుకుంటారు, తమ పిల్లలను బడికి పంపుతారు, వ్యాధుల నుంచి విముక్తికి ఔషధాలు కొనుక్కుంటారు, మొబైల్ ఫోన్స్ ఉపయోగిస్తారు. వీటితో పాటు టెలివిజన్ కార్యక్రమాలను వీక్షిస్తారు, సామాజిక మాధ్యమాల్లో పోస్టులను చదవడంలో నిమగ్నమవుతారు, భద్రమైన జీవనం, సంతోషదాయక జీవితాన్ని కోరుకుంటారు-- ఇవన్నీ వ్యక్తుల వినియోగాలు. ఈ మొత్తం వినియోగాల విలువ ఎంత? ప్రభుత్వం విధించే, ఇచ్చే రాయితీలను పరిగణనలోకి తీసుకున్న తరువాత వినియోగం (కన్సంప్షన్), మదుపు (ఇన్వెస్ట్‌మెంట్), ప్రభుత్వ వ్యయం (గవర్నమెంట్ స్పెండింగ్), నికర ఎగుమతులు (ఎక్స్--ఎమ్) మొత్తమే స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ). ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యాన్ని కొలవడానికి జీడీపీ వృద్ధిరేటు చాలా ముఖ్యం. 2026--27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి (ఏప్రిల్ నుంచి జూన్ వరకు) జీడీపీ అంకెలను గణాంకాల, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ ఇటీవల విడుదల చేసింది. 2025--26 ఆర్థిక సంవత్సర మొదటిత్రైమాసికంతో పోలిస్తే జీడీపీ వృద్ధిరేటు నామమాత్ర (ప్రస్తుత) ధరల ప్రకారం 10.3 శాతంగాను, స్థిర ధరల ప్రకారం 7.8 శాతంగాను నమోదయింది. ఈ గణాంకాల పట్ల ప్రభుత్వ ఆర్థికవేత్తలు ఎనలేని సంతృప్తి, ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. సంశయగ్రస్తులూ తక్కువేవీ కాదు. వీరు అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. జీడీపీ గణాంకాల విశ్వసనీయతపై ప్రస్తుతం ఒక తీవ్ర చర్చ నడుస్తోంది. ఫెడరల్ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే 'ఒక దేశం, ఒకే ఎన్నిక' ప్రతిపాదనపై కంటే జీడీపీ అంకెలు, వాటి పెరుగుదల ప్రయోజనాలు ప్రజల జీవితాల్లో ప్రతిబింబిస్తున్నాయా అన్న విషయమై చర్చించడం మంచిది. గణాంకాల, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ వెల్లడించిన జీడీపీ అంకెలు సరైనవని భావిద్దాం. రెండు భిన్న ఆధార సంవత్సరాల (బేస్ ఇయర్స్) ప్రాతిపదికన నామమాత్ర జీడీపీ, వాస్తవ జీడీపీ సంయుక్త వార్షిక వృద్ధిరేటు (కాంపౌండెడ్ యాన్యువల్ గ్రోత్ రేట్-- సీఏజీఆర్) ఇలా ఉంది: సంవత్సరం ఎదుట బ్రాకెట్‌లోని మొదటి సంఖ్య ప్రస్తుత ధరల ప్రకారం నామమాత్ర జీడీపీని, రెండో సంఖ్య స్థిర ధరల ప్రకారం వాస్తవ జీడీపీని లక్షల కోట్ల రూపాయల్లో సూచిస్తుంది: ఆర్థిక సంవత్సరం 2022--23: (268.90, 161.65); 2023--24: (301.23, 176.51); 2024--25: (330.68, 187.97); 2025--26: (357.14, 201.90).


సీఏజీఆర్: నామమాత్ర జీడీపీకి 9.92శాతం; వాస్తవ జీడీపీకి 7.69శాతం.

ఆధార సంవత్సరం 2022--23 ప్రాతిపదికన జీడీపీ అంకెలు ఇలా ఉన్నాయి: ఆర్థిక సంవత్సరం 2022--23: (261.77, 261.77); 2023--24: (290.73, 280.94); 2024--25: (317.99, 301.15); 2025--26: (345.37, 324.70).

సీఏజీఆర్: నామమాత్ర జీడీపీకి 9.68శాతం; వాస్తవ జీడీపీకి 7.45శాతం.

కొత్త ఆధార సంవత్సరం ప్రాతిపదికన 2026--27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో నామమాత్ర జీడీపీ 88.26 లక్షల కోట్లు కాగా వాస్తవ జీడీపీ 81.36 లక్షల కోట్లు.

2025--26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో కంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సర మొదటి త్రైమాసికంలో పెరుగుదల నామమాత్ర జీడీపీ 10.33శాతం, వాస్తవ జీడీపీ 7.82శాతం. పరిగణనలోకి తీసుకున్న నాలుగు ఆర్థిక సంవత్సరాలకు గాను




సీఏజీఆర్ పాత, కొత్త ఆధార సంవత్సరాల ప్రాతిపదికన ఇంచుమించు ఒకే విధంగా ఉండడం గమనార్హం. 2026--27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో వృద్ధిరేటు స్వల్పస్థాయిలో మాత్రమే అధికంగా ఉన్నది. దీన్నిబట్టి దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతుల గురించి మనం ఎటువంటి అభిప్రాయానికి రావచ్చు? ఇదీ నా అభిప్రాయం: 2026--27లో భారత ఆర్థిక వ్యవస్థ దశ దిశ మారలేదు. దాని పురోగమనం వేగం పుంజుకోలేదు. మరి ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడానికి నిజంగా ఏమైనా ఉందా? ఏమీలేదు. పాత ఆధార సంవత్సరం ధరల ప్రాతిపదికన అంచనాలలో స్థిర ధరల్లో జీడీపీ, నామమాత్ర ధరల్లో జీడీపీతో పోలిస్తే చాలా నిరుత్సాహకరంగా ఉన్నది. అయితే కొత్త ఆధారసంవత్సరం ధరల ప్రాతిపదికన అంచనాలలో అలా లేదు. ఎందుకని? ఆ వ్యత్యాసం చాలా చికాకుపరచడం లేదూ? అదలా ఉంచితే అంకెల్లో ఘనంగా ఉన్న జీడీపీ వృద్ధిరేటు సామాన్య ప్రజల జీవితాల్లో అంతే ఉజ్వలంగా ప్రతిబింబిస్తున్నదా? ఉద్యోగాల సృష్టి, వేతనాల పెరుగుదల, వినియోగం పరిమాణం, వ్యాపార వాణిజ్యాలు, పెట్టుబడులు మొదలైన విషయాలలో ఆ వృద్ధి ఎలా కనిపిస్తోంది? కొన్ని ప్రాసంగిక ప్రశ్నలు:

15 నుంచి 29 సంవత్సరాల వయసు యువజనులలో నిరుద్యోగిత రేటు అధిక స్థాయిలో 16.2శాతం మేరకు ఎందుకు ఉన్నది? 29 నుంచి 34 సంవత్సరాల వయసులో ఉన్న పట్టభద్రులలో నిరుద్యోగిత రేటు తరచూ 40 నుంచి 45శాతం దాకా ఉంటోంది. కారణమేమిటి? నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం-- 15 నుంచి 29 సంవత్సరాల వయసులో ఉన్న 8.7 కోట్ల మంది యువజనులు అటు ఉద్యోగంలో గానీ, ఇటు విద్యాభ్యాసం, వృత్తిపరమైన శిక్షణలో గానీ లేరు. ఎందుకని?; వాస్తవ వేతనాల పెరుగుదల చాలా నిరుత్సాహకరంగా ఉన్నది. రోజువారీ కూలీలు, వేతన ఉద్యోగులు, స్వయం ఉపాధి కార్మికులకు ఆ వాస్తవ వేతనాల పెరుగుదల వరుసగా (--) 5.5, 1.7, 3.3 శాతంగా మాత్రమే ఉంది. దేశ కార్మికశక్తిలో రోజువారీ కూలీలు 20శాతంగా ఉన్నారు. వాస్తవ వేతనాల పెరుగుదల అంత ప్రతికూలంగా ఉన్నప్పుడు కాయకష్టంపై బతుకుతున్న కోట్లాది శ్రామికుల జీవితాలలో పండుగలు ఎలా పరిమళిస్తాయి?

నికర ఎఫ్‌డీఐ (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు) చాలా తక్కువగా ఎందుకు ఉన్నాయి? ఎఫ్‌సీఎన్ఆర్ (ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్-- ప్రవాస భారతీయుల కోసం భారతదేశంలోని బ్యాంకుల్లో విదేశీ కరెన్సీలోనే డబ్బు దాచుకునే సౌలభ్యమున్న ఒక ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతా. ఈ డిపాజిట్లపై 6 నుంచి 7శాతం వడ్డీ ఇస్తారు) నిధులు పెద్ద ఎత్తున సమకూరుతుండగా విదేశీ పెట్టుబడులు ప్రత్యక్ష మదుపులుగా ఎందుకు రావడం లేదు?; మన విదేశీ మారకద్రవ్య నిల్వలు ఎన్నడూ లేని రీతిలో అత్యధికం (740 బిలియన్ డాలర్లు)గా ఉన్నాయి. అయినా రూపాయి విలువ ఎందుకు పెరగడం లేదు? ఈ ఏడాది జనవరి నుంచి డాలర్--రూపాయి మారకం రేటు దాదాపు 5శాతం మేరకు తగ్గిపోయింది. ఆసియా దేశాల కరెన్సీలలో కెల్లా రూపాయి విలువే చాలా అధమంగా ఉన్నది. ఎందుకని?

ఎగుమతులు పెరుగుతున్నాయి. దిగుమతులూ పెరుగుతున్నాయి. ప్రస్తుత ధరల వద్ద దిగుమతులు చాలా వేగంగా పెరుగుతున్నాయి. మన విదేశీ వాణిజ్యలోటు ఈ ఏడాది ఏప్రిల్--ఆగస్టులో 150 బిలియన్ డాలర్ల మేరకు ఉన్నది. చైనాతో వాణిజ్య లోటు ఈ ఏడాది ఏప్రిల్--జూలైలో 44 బిలియన్ డాలర్లుగా ఉన్నది. ఈ వాణిజ్యలోటు దేశ ఆర్థిక వ్యవస్థకు పెనుభారంగా లేదూ? మేకిన్ ఇండియా, పీఎల్ఐ, ఎన్ఎమ్‌సీపీ మొదలైన పథకాలు మన తయారీరంగాన్ని ఎందుకు మెరుగుపరచడం లేదు? చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులను దేశంలోనే ఉత్పత్తి చేసుకునే సామర్థ్యాన్ని ఎందుకు సమకూర్చడం లేదు?

తయారీరంగం నామినల్ జీవీఏ (నామమాత్ర స్థూల విలువ జోడింపు-- ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేయకుండా ప్రస్తుత మార్కెట్ ధరల వద్ద ఒక ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి అయిన వస్తు సేవల మొత్తం విలువను లెక్కగట్టే కొలమానం) 13శాతం వద్దే ఎందుకు స్తంభించిపోయింది? ప్రభుత్వ పథకాలు ఈ పరిస్థితిని ఎందుకు చక్కదిద్దలేకపోతున్నాయి?

గ్రాస్ ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఫార్మేషన్ (జీఎఫ్‌సీఎఫ్--స్థూల స్థిర మూలధన నిర్మాణం-- ఒక ఆర్థిక వ్యవస్థలో వ్యాపార సంస్థలు, ప్రభుత్వాలు సంపాదించిన, నిర్మించిన స్థిర ఆస్తుల నికర విలువను కొలుస్తుంది) జీడీపీలో 33.5శాతంగా మాత్రమే ఎందుకు ఉండిపోతోంది? ఈ జీఎఫ్‌సీఎఫ్‌లో ప్రైవేట్ కార్పొరేట్ మూలధన వ్యయం ఎంతకూ 12శాతంగా మాత్రమే ఉంటోంది. కార్పొరేట్ మదుపుదారులు మూలధన పెట్టుబడులు ఎందుకు పెట్టడం లేదు?; పెరిగిన జీడీపీ వృద్ధిరేటు మెరుగైన పాఠశాలలు, ఆస్పత్రులు, రహదారులు, మంచినీటి సరఫరా, పోలీసు సేవలకు ఎందుకు దోహదం చేయడం లేదు? ఈ సదుపాయాల విషయంలో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారనేది ఒక కఠోర వాస్తవం కాదూ?

ఎటుచూసినా నిరుత్సాహకర పరిస్థితులే. మరి జెన్‌జీ యువజనులు నిరసనలు తెలుపడంలో ఆశ్చర్యమేముంది? మంచి భవిష్యత్తు సమకూరగలదనే ఆశాభావాన్ని వారిలో దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతులు ఎంతమాత్రమూ పాదుకొల్పడం లేదు. గణాంకాల ప్రకారం మన ఆర్థిక వ్యవస్థ 7.8శాతం వృద్ధిరేటుతో పురోగమిస్తుండవచ్చు, కానీ అత్యధిక ప్రజలు ఆ విషయాన్ని అనుభవపూర్వకంగా నమ్మడం లేదు. పాలకులు ఏమి చెబుతున్నప్పటికీ తమ జీవన ప్రమాణాలు గతంలో కంటే మెరుగ్గా లేవన్న నిజం మాత్రమే వారికి తెలుసు.

# అసెంబ్లీ.. అణచివేత వేదిక

శాసనసభలో సమస్యలపై చర్చ జరిగి పరిష్కారాలు కొంతవరకైనా లభిస్తాయేమోనని తెలంగాణ ప్రజలు ఆశగా ఎదురుచూశారు. తీరా అసెంబ్లీ సమావేశాలు వచ్చేసరికి పరిస్థితి ఉద్రిక్తంగా మారిపోయింది. మొదటి రోజు ప్రధాన ప్రతిపక్షం బారికేడ్లు దాటకుండానే అరెస్టులు, దాడులకులోనై వెనుదిరిగిన పరిస్థితి ఏర్పడింది. రెండో రోజు అసెంబ్లీలో ఏం జరిగిందో ప్రజలకు తెలియకుండా మరొక ప్రేరేపిత నిరసన కార్యక్రమంతో రాష్ట్రం అట్టుడికిపోయింది. మూడవ రోజు ప్రధాన ప్రతిపక్ష పార్టీ శాసనసభ్యులందరినీ శీతాకాల సమావేశాల నుంచి బహిష్కరించింది. ఇక ప్రధాన సమస్యలు, ప్రజల గోస ఎజెండా మీదకు రాకుండానే సమావేశాలు సాగుతున్నాయి.స్థానిక వార్తలు అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నయి. సమావేశాలు 7న మొదలయ్యాయి. శనివారం మండలి నిరవధికంగా, అసెంబ్లీ 16కు వాయిదా పడ్డాయి. ఈ ఐదు రోజుల్లో జరిగిన పరిణామాలు చూస్తే సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధి చూపలేదనే విషయం స్పష్టమైంది. ఓ వైపు సభ్యులను సభకు రాకుండా అడ్డుకోవడం, సభ జరుగుతుంటే బయట గందరగోళం సృష్టించడం కాంగ్రెస్ నేతల తొండి వైఖరికి నిదర్శనంగా నిలిచింది. అలాగే పాలకపక్షం నేతలు వింత చేష్టలకు పాల్పడ్డారు. కేసీఆర్ ఇంటి ముందు చావు డప్పు పేరిట ఆందోళన నిర్వహించారు. ప్రజల దృష్టిని అసెంబ్లీ నుంచి మళ్లించేందుకు కుట్రలు పన్నారు. ఇందుకు అధికార పక్షమే బాధ్యత వహించాలి. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి మీద చర్చ జరగాలని వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టినా అధికార పక్షం నిర్లక్ష్యం వ్యవహరించింది.

తెలంగాణలో కేసీఆర్ కంటే మెరుగైన పాలన తెస్తామంటూ రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య స్ఫూర్తి, పారదర్శక పాలన పేరిట కాంగ్రెస్ హామీలు గుప్పించింది. కానీ హస్తం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ఆశించిన మార్పు లేదు. కేసీఆర్ పాలనను చేజార్చుకున్నందుకు ప్రజలు బాధ పడుతు న్నరు. ప్రజాస్వామ్యవాదులకు నైరాశ్యమే మిగులుతున్నది. శాసనసభ వేదికగా ప్రజాసమస్యలపై జరుగవలసిన అర్థవంతమైన చర్చలను పక్కనపెట్టి, నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేయడం, ప్రాంగణం వెలుపల పోలీసులతో అడ్డుకోవడం ఆందోళనకరం. కొండంత హామీలిచ్చి, ఆ హామీలను నెరవేర్చడంలో, ప్రజలను పట్టిపీడిస్తున్న క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వానికి కొంచెం కూడా చిత్తశుద్ధి లేదనేది స్పష్టమవుతున్నది. శాసనసభలో ప్రశ్నలను తప్పించుకోవడం, వీధుల్లో నిరసనలను పోలీసు బలప్రయోగంతో అణచివేయడం ద్వారా ప్రభుత్వం తన జవాబుదారీతనం నుంచి పూర్తిగా తప్పుకొంటున్నది.

ప్రజాస్వామ్యంలో అధికారం అనేది ప్రజలకు సేవ చేయడానికి, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి లభించే ఒక బాధ్యత. అయితే, ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును పరిశీలిస్తే, ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి లేదా క్షేత్రస్థాయిలో పెద్దఎత్తున నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎంతమాత్రం సిద్ధంగా లేదనేది స్పష్టమవుతున్నది. ఎన్నికల ముందు ఇచ్చిన 'ఆరు గ్యారెంటీలు' సహా ఎన్నో ఆకర్షణీయమైన హామీలను ప్రభుత్వం అమలు చేయలేక చేతులెత్తేసింది.


రైతుభరోసా, రుణమాఫీ, మహిళలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి వంటి హామీలు అటకెక్కాయి. కనీసం ఎప్పుడు అమలు చేస్తారో కూడా ప్రభుత్వం చెప్పడంలేదు. స్పష్టమైన కాలానుగుణ ప్రణాళిక, బడ్జెట్ కేటాయింపులు లేకుండా కేవలం కాలయాపన చేస్తున్నది. హామీల అమలుపై శాసనసభలో ప్రశ్నలు సంధించినప్పుడు ప్రభుత్వం వద్ద తగిన డాటా కానీ, స్పష్టమైన సమాధానాలు కానీ లభించడం లేదు. శాసనసభను చర్చల వేదికగా కాకుండా, అణచివేత సాధనంగా మార్చడం ఆక్షేపణీయం. సభలో ప్రతిపక్షాలపై పేర్కొన్న ఆరు కీలక సమస్యలపై సమగ్ర చర్చను కోరినప్పుడు, ప్రభుత్వం వాటికి సమాధానాలు చెప్పి పరిష్కార మార్గాలు చూపాలి. కానీ, ప్రతిపక్ష సభ్యులను వరుసగా సస్పెండ్ చేయడం ద్వారా సభాహక్కుల ఉల్లంఘన చేస్తున్నది. అసెంబ్లీ గేట్ల వద్దే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడం ప్రభుత్వ అభద్రతా భావాన్ని, నిర్లక్ష్యాన్ని తెలియజే స్తున్నది. సభలో చర్చలు జరక్కుండా, ప్రజల దృష్టి మళ్లించేలా సభను త్వరితగతిన ముగించడం లేదా హడావుడిగా బిల్లులు పాస్ చేసుకోవడం ప్రభుత్వం తన జవాబుదారీతనం నుంచి పారిపోవడమే అవుతుంది.

రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం కూడా నేడు సంతోషంగా లేదు. భూమి హక్కులు కోల్పోయిన బాధితులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక సతమతమవుతున్న విద్యార్థులు, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు, దాదాపు ఆరు విడతల డీఏలు బకాయిలు పడి ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు రోజువారీగా రోడ్లెక్కి ఆందోళనలు చేస్తున్నారు. అయితే, ఆందోళనకారుల వద్దకు వెళ్లి మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాల్సిన ప్రభుత్వం, వారిపై పోలీసు కేసులు పెట్టడం, ముందస్తు నిర్బంధాలు, అసెంబ్లీ ముట్టడి పిలుపులను భగ్నం చేయడానికి సరిహద్దుల్లో బారికేడ్లు కట్టడం వంటి చర్యలకే ప్రాధాన్యమిస్తున్నది. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ అత్యున్నతమైనది, అలాగే సభాపతి స్థానం అత్యంత గౌరవప్రదమైనది. స్పీకర్ పదవికి ఎన్నికైన వ్యక్తి ఏ పార్టీకి చెందినవారైనా, ఆ పీఠంలో కూర్చు న్న తర్వాత రాజ్యాంగబద్ధంగా, రాజకీయాలకు అతీతంగా, నిష్పాక్షికంగా వ్యవహరించాలి. సభలో అధికార, ప్రతిపక్షాల హక్కులను పరిరక్షించడం స్పీకర్ ప్రాథమిక బాధ్యత. అయితే, ప్రస్తుతం స్పీకర్ స్థానం నిష్పాక్షికతను కోల్పోయి, ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి, సభా కార్యకలాపాల నుంచి వారిని దూరంగా ఉంచడానికి ఉపయోగపడుతున్నదనే విమర్శలు రావడం చాలా బాధాకరం. ప్రజాప్రతినిధులపై ఎలాంటి ప్రామాణికమైన లేదా అధికారిక ఆధారాలు లేకుండా ఏకపక్షంగా సస్పెన్షన్ వేటు వేయడం అత్యంత విచారకరం. ఈ ధోరణిపై అత్యున్నత నాయస్థానం పలు సందర్భాల్లో ఆందోళన వ్యక్తం చేసింది. రాజారామ్ పాల్ కేసులో (2007) సభకు చర్యలు తీసుకునే అధికారం ఉన్నప్పటికీ, ఆ అధికారాలు రాజ్యాంగానికి, ప్రాథమిక హక్కులకు లోబడి ఉండాలని, న్యాయ సమీక్షకు అతీతం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

నవగీత
తెలుగు దినపత్రిక
ఆదివారం
13 సెప్టెంబర్ 2026

# కొండ విజయ్ జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం

## రక్తదాన శిబిరం ప్రారంభించి కొండ విజయ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే గాంధీ





**శేరిలింగంపల్లి :** హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ లో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన మెగా రక్తదానం శిబిరంలో తాజా మాజీ కార్పొరేటర్లు హమీద్ పటేల్,ఉప్పలపాటి శ్రీకాంత్,సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి శాలవతో సత్కరించి,కేక్ కట్ చేసి జన్మదినం శుభాకాంక్షలు తెలియచేసి,రక్తదానం శిబిరంలో పాల్గొన్న వారికి ప్రశంస పత్రాలు అందచేసిన పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ... హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ జన్మదినం శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను అని,కొండా విజయ్ సామాజిక బాధ్యత తో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు అని, సమాజ హితం ఆయన చేసే సేవలు అభినందనీయం అని పిఏసి చైర్మన్ గాంధీ కొనియాడారు.కొండా విజయ్ జన్మదినం ను పురస్కరించుకొని మెగా రక్తదానం శిబిరం మరియు అన్నదానం కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయం అని పిఏసి చైర్మన్ గాంధీ తెలియచేశారు.రక్తదానం శిబిరంలో సుమారుగా 115 మంది రక్తదానం చేయడం గొప్ప విషయం అని,రక్తదానం లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియచేస్తున్నాను అని పిఏసి చైర్మన్ గాంధీ తెలియచేశారు.అన్ని దానంల కన్నా రక్తదానం చాలా గొప్పది అని రక్తదానం చేయండి ప్రాణ దాతలు కండి, రక్తదానం చేయడం ద్వారా మనం సాటి మనిషి ప్రాణాలు కాపాడిన వారు అవుతారు అని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా రక్తదానం చేయాలని ,ప్రతిరోజూ రక్తం అవసరం ఉండి ఎంతోమంది ఇబ్బందులకు గురౌతున్నారని, తలసేమియా,గర్భిణులు, ప్రమాదాల్లో గాయపడిన వారు రక్తం కోసం పాట్లు పడుతున్నారన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చు అని పిఏసి చైర్మన్ గాంధీ ల తెలియచేశారు.ప్రతి రక్తపు బొట్టు విలువైనదని, ఏదైనా పునరుత్పత్తి చేసుకోవచ్చు గానీ రక్తాన్ని మాత్రం ఎవరో ఒకరు దానం చేయడం వల్లే పొందవచ్చన్నారు. రక్త దానంపై అపోహలు వీడాలనీ పిఏసి చైర్మన్ గాంధీ తెలియచేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు ,అబిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నోటీసుల పంపిణీ, విచారణల్లో పరిగి నియోజకవర్గం పురోగతి

## 73,487 నోటీసులకు 43,788 విచారణలు పూర్తి





**పరిగి :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్--2026) కార్యక్రమంలో భాగంగా పరిగి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఏఈఆర్వోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు విస్తృతంగా విచారణలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని 305 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మొత్తం 73,487 నోటీసులు రూపొందించగా, వాటిలో 69,010 నోటీసులు పంపిణీ అయ్యాయి. ఇప్పటివరకు 43,788 విచారణలు పూర్తయ్యాయి. మండలాల వారీగా ఏఈఆర్వోలు, తహసీల్దార్ల ఆధ్వర్యంలో విచారణలు కొనసాగుతున్నాయి. దోమ తహసీల్దార్, ఏఈఆర్వో రాజగోపాల్, మహమ్మదాబాద్ తహసీల్దార్, ఏఈఆర్వో విద్యాసాగర్ రెడ్డి, కుల్కచర్ల తహసీల్దార్, ఏఈఆర్వో పురుషోత్తం, చౌడాపూర్ తహసీల్దార్, ఏఈఆర్వో వెంకటేశ్వర్లు, పరిగి తహసీల్దార్ ఎం. వెంకటేశ్వరి, పరిగి ఏఈఆర్వో, డిప్యూటీ తహసీల్దార్ జి. విజయేందర్, పూడూరు తహసీల్దార్, ఏఈఆర్వో విజయ్కుమార్ తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో నోటీసుల పంపిణీ, అభ్యంతరాల స్వీకరణ, విచారణల నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు.

అధికారుల నివేదికల ప్రకారం, నోటీసుల రూపొందింపు ప్రక్రియ పూర్తయి, మిగిలిన నోటీసుల పంపిణీతో పాటు పెండింగ్ విచారణలను కూడా వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు, పోలింగ్ కేంద్రాల వారీగా శిబిరాలు కొనసాగుతున్నాయి. ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ....పరిగి టౌన్‌లో పోలింగ్ స్టేషన్ నెం.218, బర్కత్‌పల్లి గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నెం.252లను సందర్శించిన అధికారులు ప్రత్యేక ప్రచార దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం పరిగి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిగి తహసీల్దార్ వెంకటేశ్వరి, ఏఈఆర్ వో విజయేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా పరిగి టౌన్‌లోని పోలింగ్ స్టేషన్ నెం.218తో పాటు బర్కత్‌పల్లి గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నెం.252ను పరిశీలించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్--2026) పురోగతిని సమీక్షించి, ఫారాలు స్వీకరణ, నమోదు ప్రక్రియ, అవసరమైన పత్రాల పరిశీలన తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాల పనితీరును పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక ప్రచార దినోత్సవాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

# కాక్రావేణి నదిలో అక్రమ ఇసుక రవాణా.



**యాలాల్ :** కాక్రావేణి నదిలో అక్రమ ఇసుక రవాణా ఇష్టం వచ్చినట్లు సాగుతున్న అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ మండల యాలాల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి మండిపడ్డారు. శనివారం వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం విశ్వనాథ్‌పూర్ గ్రామ శివారులోని కాక్రావేణి నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. నదిలో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాక్రావేణి నది పరిధిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారుల కళ్లముందే ఇసుక తరలింపు జరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. యాలాల్ మండలంలోని కొంతమంది ప్రముఖ నాయకులకు ముడుపులు చెల్లిస్తూ ఇసుక అక్రమ రవాణాకు సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇసుక రవాణాకు ఉపయోగిస్తున్న వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. కాక్రావేంద్ నది నుంచి ఇసుక అక్రమ రవాణాను వెంటనే అరికట్టాలని, సంబంధిత అధికారులు ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించాలని రవీందర్ రెడ్డి డిమాండ్ చేశారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ వడ్డే రాములు డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి







**పరిగి :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పూడూరు మాజీ జెడ్పీటీసీ మేఘామాల ప్రభాకర్ గుప్తా ఆధ్వర్యంలో పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి ఉచితంగా పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా మహేష్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని కోరారు.
ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, తగిన జాగ్రత్తలు పాటిస్తూ వినాయక చవితి వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. పరిగి నియోజకవర్గ ప్రజలకు ముందస్తుగా శ్రీ సిద్ధి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

# పారిశుధ్ధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలేవి..?

## పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి లేకుంటే విధుల బహిష్కరణ

## ప్రజా హక్కుల పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జి దోర్నాల మల్లేశం హెచ్చరిక



**వికారాబాద్ :** వికారాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్ధ్య కార్మికులకు గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న మున్సిపల్ అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ప్రజా హక్కుల పోరాట సమితి వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి దోర్నాల మల్లేశం హెచ్చరించారు. కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దోర్నాల మల్లేశం మాట్లాడుతూ.. పారిశుధ్ధ్య కార్మికులతో నిరంతరం శ్రమ చేయించుకుంటూ, వారికి చెల్లించాల్సిన వేతనాలను మాత్రం నిలిపివేయడం సరికాదన్నారు. కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ అధికారులు పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే పెండింగ్ వేతనాలను విడుదల చేయకపోతే పారిశుధ్ధ్య కార్మికులతో కలిసి విధులను బహిష్కరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్మికుల సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, వేతనాల చెల్లింపునకు చర్యలు తీసుకునేలా అధికారులపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు.

# యువతతో ఆత్మీయంగా మెతుకు ఆనంద్..

## నవాబుపేటలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి సందడి



**వికారాబాద్ :** నవాబుపేట మండలంలో నిర్వహించిన ఓ ప్రైవేట్ ఫంక్షన్‌కు బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌తో కలిసి వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక యువతతో మెతుకు ఆనంద్ ఆత్మీయంగా మమేకమై వారితో కొద్దిసేపు మాట్లాడారు. యువత యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న ఆయన, వారి సమస్యలు, స్థానిక పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా యువతతో సరదాగా ముచ్చటిస్తూ ఆత్మీయ వాతావరణాన్ని నెలకొల్పారు. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, మెతుకు ఆనంద్ కలిసి కార్యక్రమానికి హాజరు కావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లోనూ ఉత్సాహం నెలకొంది.

# రాజీ మార్గమే సత్వర న్యాయానికి మార్గం.!

## జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



**వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని శనివారం వికారాబాద్ కోర్టు ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్ హాజరయ్యారు. జిల్లా పోలీస్ శాఖ తరపున అదనపు ఎస్పీ రాజేష్ మీనా పాల్గొని, లోక్ అదాలత్ నిర్వహణకు పోలీస్ శాఖ తరపున పూర్తి సహకారం అందించారు. ఈ సందర్భంగా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరస్పర అంగీకారం, రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ చక్కటి వేదిక అని అధికారులు తెలిపారు. దీని ద్వారా కక్షిదారులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు సత్వర న్యాయం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి పి. ప్రదీప్ నాయక్, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఏ. రాధిక, సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్. శాంతిలత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. వైష్ణవి, జిల్లా సంక్షేమ అధికారి కె. కాంతారావు, డీఎల్ఎస్ఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకులను ప్రతిష్ఠిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం



**పరిగి :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే డా.టి.రామ్మోహన్ రెడ్డి వారి నివాసంలో తమ్మన్నగారి ఉమా రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.
తమ్మన్నగారి ఉమా రామ్మోహన్ రెడ్డి గారు,యువ నాయకులు, టీపీసీసీ మెంబర్ డాక్టర్ టి.రితిక్ రెడ్డి గారు స్థానిక నాయకులతో కలిసి ప్రజలకు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.
మట్టి వినాయకుల వినియోగం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు సంప్రదాయాలను పరిరక్షించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పార్థసారథి పంతులు, మున్సిపల్ చైర్మన్ రజిత వెంకటేష్, మార్కెట్ కమిటీ చైర్మన్లు పరశురాం రెడ్డి, ఆంజనేయులు ముదిరాజ్, కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట్రాములు, రామకృష్ణ రెడ్డి, వైస్ చైర్మన్ రాజ పుల్లారెడ్డి కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
13 సెప్టెంబర్ 2026

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ.

**చెక్కుల మంజూరుకి కృష చేసిన, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే తెల్లంకి ప్రత్యేక ధన్యవాదాలు.**

**సీనియర్ కాంగ్రెస్ నాయకుడు. విక్రాంత్.**

**ములుగు,సెప్టెంబర్ 12,(నవగీతం)**దములుగు జిల్లా వాజేడు మండలం, నాగారం, చందుపట్ల గ్రామాలకు చెందిన వ్యక్తులు అనారోగ్యానికి గురై ఆసుపత్రికి వెళ్లి ఆర్థికంగా నష్టపోయిన కుటుంబస్తులు సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకున్నారు. ఈసందర్భంగా, యాలం హనుమంతరావు, వనపర్తి సృజనకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద చెక్కులు మంజూరు అయ్యాయి. ఈ చెక్కులను వాజేడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకర్లపూడి విక్రాంత్ బాబు చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు అందజేశారు. నాగారం గ్రామానికి చెందిన యాలం హనుమంతరావుకు రూ. 1,50,500 రూపాయలు, మరియు 1,47,000, చంద్రుపట్ల గ్రామానికి చెందిన వనపర్తి సృజనకు రూ. 85,000 చెక్కు అందజేయడం జరిగింది. మొత్తం రూ. 3,82,500 మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా విక్రాంత్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి సీఎం రిలీఫ్ ఫండ్ అందించడానికి కృషిచేసిన మంత్రి సీతక్కకు, భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎవరైనా అనారోగ్యానికి గురై



ఆసుపత్రిపాలై ఆర్థికంగా నష్టపోయి ఉంటే ప్రతి ఒక్కరు సీఎం రిలీఫ్ ఫండ్ కు అప్లై చేసుకోవాలని, ప్రభుత్వం ఆదుకోవడానికి సిద్ధంగా ఉందనని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తల్లడి ఆదినారాయణ, నల్లగాసి రమేష్, అనుముల సంజీవ, బోదెబోయిన రామన్న, యాలం సీతాలు, తల్లడి నానిబాబు, చింతకుంట్ల మదనయ్య తదితరులు పాల్గొన్నారు.

## రూ.11 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**గ్రామాభివృద్ధే ధ్యేయం సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి**





**కొడిమ్యాల,సెప్టెంబర్ 12.(నవగీతం):** గ్రామంలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి అన్నారు. కొడిమ్యాల గ్రామ పంచాయతీ పరిధిలోని 11, 13వ వార్డుల్లో రూ.11 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు.?చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో, విబి--జీరాంజీ (వీబీ--జీరాంజీ) నిధుల ద్వారా 13వ వార్డులో రూ.8 లక్షలతో సీసీ రోడ్డు, సైడ్ డ్రైనేజీ పనులను, అలాగే 11వ వార్డులో రూ.3 లక్షలతో సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు.?ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తూ కొడిమ్యాలను మోడల్ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.?ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుర్రం నర్సయ్య, వార్డు సభ్యులు రాపర్తి నర్సింగరావు, బోగ గౌతమీ రవి, నార్ల శ్రీజ సాయి, మహేందర్, నాయకులు వినోద్ రెడ్డి, నాగార్జున, యాది తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణంలో ప్రమాదవశాత్తు కార్మికుడి మృతి

**హసన్‌పర్తి :** హసన్‌పర్తి పరిధిలోని ఎస్సార్ విశ్వవిద్యాలయ భవన నిర్మాణ పనుల్లో ప్రమాదం చోటుచేసుకుంది. ఇనుపరాడ్డు తలకు గుచ్చుకోవడంతో జార్ఖండ్‌కు చెందిన కార్మికుడు పప్పు కుమార్ (31) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు హసన్‌పర్తి పోలీసు ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు.జార్ఖండ్ రాష్ట్రం లాతేహార్ జిల్లా మురుపు ప్రాంతం బాలుగాడి గ్రామానికి చెందిన పప్పు కుమార్ తన సోదరుడు గుడ్డు భుయ్యా (38), తోటి మేస్త్రీ ప్రదీప్‌తో కలిసి ఉపాధి కోసం వరంగల్‌కు వచ్చాడు. ఎస్సార్ విశ్వవిద్యాలయ భవన నిర్మాణంలో ఇనుపరాడ్లను వంచే పనులు చేస్తున్నాడు. ఈ నెల 9న ఉదయం 7.30 గంటల సమయంలో భవనంలోని నాలుగో అంతస్తు నుంచి కిందకు, కింది నుంచి పైకి ఇనుపరాడ్లను తరలిస్తుండగా ఓ రాడ్ ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తు నుంచి కిందపడి పప్పు కుమార్ తలకు బలంగా గుచ్చుకుంది. తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే అంబులెన్సులో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 10న రాత్రి 10.18 గంటలకు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఘటనపై మృతుడి సోదరుడు గుడ్డు భుయ్యా శనివారం హసన్‌పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహణ కమిటీ ఎన్నికల ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు సెప్టెంబర్ 14లోపు సమర్పించాలి

**జనగామ :** జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు జనగామ ఆదేశానుసారం, జిల్లా ఉపాధి కల్పనాధికారి, జనగామ ను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహణ కమిటీ సభ్యుల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారిగా నియమించడమైనదని, సమయ ప్రణాళికలో భాగంగా సెప్టెంబర్ 9వ తేదీన అర్హత కలిగిన ఓటర్ల జాబితాను ప్రచురించడమైనదని, జాబితాపై ఏవైనా అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్న అర్హత కలిగిన సభ్యులు తమ అభ్యంతరాలు, ఆక్షేపణలను ఈ నెల సెప్టెంబర్ 14వ తేదీలోపు ఎన్నికల అధికారి, జిల్లా ఉపాధి కల్పనాధికారికి, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, అంబేద్కర్ నగర్, జనగామ నందు లిఖితపూర్వకంగా సమర్పించవలసిందిగా ఎన్నికల అధికారి తెలిపారు. ఈ నెల 15వ తేదీన అందిన అభ్యంతరాలు, ఆక్షేపణలను పరిశీలించి, ఓటర్ల జాబితాలో అవసరమైన మార్పులు, చేర్పులపై అభిప్రాయాలను స్వీకరిస్తారని, అనంతరం తుది నిర్ణయం కోసం సెప్టెంబర్ 16న రాష్ట్ర శాఖకు జాబితాను పంపించనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. సెప్టెంబర్ 19న తుది ఓటరు జాబితాను ప్రచురించడంతో పాటు అదే రోజు ఎన్నికల నోటిఫికేషన్, ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్లు సమాచారం ఎన్నికల అధికారి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, జనగామ వెల్లడించారు.

## జనగామ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఘనంగా 'ఫ్రెషర్స్ డే'

**ముఖ్య అతిథిగా హాజరైన సీడీసీ చైర్మన్ గట్టు వెంకటేశ్వర్లు**

**జనగామ :** జనగామ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల ప్రాంగణంలో "ఫ్రెషర్స్ డే" వేడుకలను శుక్రవారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. నూతనంగా చేరిన ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు ఘనంగా స్వాగతం పలికారు.?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీసీ చైర్మన్ గట్టు వెంకటేశ్వర్లు హాజరై ప్రసంగించారు. విద్యార్థినులు చిన్నతనం నుంచే లక్ష్యాలను నిర్దేశించుకొని, ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని




## మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి



## లక్ష్మణ్‌కు ఆహ్వాన పత్రిక అందజేత

**జగిత్యాల,సెప్టెంబర్ 12,(నవగీతం)** జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ల బావి గణేష్ నగర్‌లో లక్కీ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గణేష్ ఆగమన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కోరుతూ జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్‌కు లక్కీ బాయ్స్ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు.ఆహ్వానం సందర్భంగా అడువాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో నిర్వహించాలని అన్నారు. యువత ఐక్యంగా ముందుకు వచ్చి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో లక్కీ బాయ్స్ సభ్యులు, భక్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గోవిందుపల్లెలో శ్రీరామ్ సేన యూత్ ఆధ్వర్యంలో గణేష్ ఆగమనం



**ముఖ్య అతిథిగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్**

**జగిత్యాల, సెప్టెంబర్12,(నవగీతం):** జగిత్యాల పట్టణంలోని 6వ వార్డు గోవిందుపల్లె సమీపంలోని గౌతమి స్కూల్ వద్ద శ్రీరామ్ సేన యూత్ ఆధ్వర్యంలో గణేష్ ఆగమనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువత, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ఘన స్వాగతం పలికారు.
ఈ కార్యక్రమానికి జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు.గణేష్ నామస్మరణలు, భక్తుల సందడితో గోవిందుపల్లె ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. శ్రీరామ్ సేన యూత్ సభ్యులు, స్థానిక భక్తులు ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొలగాని ప్రేమలత సత్యం, నీలి ప్రతాప్,రాజన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వినాయక నవరాత్రుల రోజువారీ కార్యక్రమాల కరపత్రం విడుదల



**మేట్ పల్లి, సెప్టెంబర్ 12 (నవగీతం):** ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న వినాయక నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన రోజువారీ కార్యక్రమాల కరపత్రాన్ని మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు రాంబాబు శనివారం విడుదల చేశారు.ఈ సందర్భంగా వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు చేపట్టిన రోజువారీ కార్యక్రమాల వివరాలను కరపత్రంలో పొందుపరిచినట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అదనపు కార్యదర్శి చాడ చంద్రకుమార్, ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి ఎలిమి రవికుమార్, కోశాధికారి దొంతుల లక్ష్మీనారాయణ, వాసవి దేవాలయ అధ్యక్షులు చాడ సురేష్, వాసవి గార్డెన్ అధ్యక్షులు కోట కిరణ్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుల్లూరి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో "పోషణ మాసం"



**కరీంనగర్, సెప్టెంబర్12,(నవగీతం)** ఐ.సి.డి.ఎస్, కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మార్కండేయ నగర్ అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, కార్పొరేటర్ తెల్ల లక్ష్మీ రమేష్, సిడిపిఓ కవిత హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని, కుటుంబ సభ్యులు వారు మంచి ఆహారం తీసుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. తద్వారా తల్లి బిడ్డలు పోషకాహార లోపం లేకుండా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.మహిళల్లో ఐరన్ లోపం అధికమించేందుకు మునగ, బచ్చలి, ఆకుకూరలు, పల్లీలు బెల్లం వంటివి తీసుకోవాలని తెలిపారు. సీజన్లో లభించే పండ్లు, తాజా కూరగాయలు ఆహారంలో భాగం చేసుకోవాలని అన్నారు. గర్భిణీలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వారి బరువు, ఎత్తు పరీక్షించుకోవాలని తెలిపారు. బరువు తక్కువగా ఉండే పిల్లల కోసం అంగన్వాడీ కేంద్రాల్లో ప్రత్యేక బాలామృతం పంపిణీ చేస్తారని తెలిపారు. నెలలు నిండిన గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిడిపిఓ కవిత వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువగా మేలు జరిగే ఆహారాలను గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా తల్లులకు క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వెంకటలక్ష్మి, అంగన్వాడి టీచర్ శ్రీలత, రమణ, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వచ్చే ఐదేళ్లలో రూ.64 వేల కోట్లతో ఆరోగ్య వ్యవస్థ బలోపేతం

-మొదటిపేజీ తరువాయి

వ్యాఖ్యానించారు. ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నడ్డా చెప్పారు. ఏపీలో రూ.1,271 కోట్లతో 24 క్రిటికల్ బ్లాకులు, 25 ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు, 45 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు నిర్మించబోతున్నామని తెలిపారు. క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో కేంద్రమంత్రి మాట్లాడారు. చంద్రబాబుతో కలిసి క్రిటికల్ కేర్ బ్లాక్‌లు, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.
గత దశాబ్ద కాలంగా దేశంలో ఎన్నో ఆరోగ్య విధానాలు తీసుకొచ్చామని కేంద్రమంత్రి జేపీ

## బిజినెస్

### టాటా పంచ్ మరింత ప్రియం..
### రూ 20 వేల వరకు రేటు పెంచిన సంస్థ




**న్యూఢిల్లీ :** దేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న ఈవీ మాడళ్లలో ఒకటైన పంచ్ ఈవీ ధరను మరోసారి పెంచింది టాటా. ఈ మాడల్ ధరను రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు సవరిస్తున్నట్టు తాజాగా ప్రకటించింది. దీంతో ఈ కారు ధర రూ.9.79 లక్షల నుంచి రూ.12.99 లక్షల మధ్యలోకి చేరుకున్నది. ఈ ఏడాది ఫిబ్రవరిలో మార్కెట్లోకి విడుదల చేసినప్పుడు ఈ కారు ధర రూ.9.69 లక్షలుగా ఉండేది. వీటిలో 30 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ ధరను రూ.10 వేలు పెంచిన సంస్థ.. 40 కిలోవాట్ల బ్యాటరీ మాడల్‌ను రూ.20 వేలు సవరించింది. సింగిల్‌చార్జింగ్‌తో 30 కిలోవాట్ల బ్యాటరీ మాడల్ 375 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా, 40 కిలోవాట్ల బ్యాటరీ మాడల్ 468 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో ఈవీ, సిట్రాయిన్ ఈసీ3, ఎంజీ కొమ్మెట్ ఈవీ, విండ్‌సర్ ఈవీలకు పంచ్ గట్టి పోటీనివ్వనున్నది.

### హీరో గ్లామర్.. ఇప్పుడు కొత్త హంగులతో..



హీరో మోటోకార్ప్.. దేశీయ మార్కెట్లో అత్యధిక అమ్మకాలు పొందుతున్న గ్లామర్ బైకుకు కొత్త అప్డేట్స్ తీసుకొచ్చింది. కంపెనీ ఇప్పుడు ఇందులో సింగిల్ ఛానల్ ఏబీఎస్, ఇంటిగ్రేటెడ్ బ్రేకింగ్ సిస్టమ్ (ఐబీఎస్)లను కలిపి రూపొందించిన కొత్త బ్రేకింగ్ సిస్టమ్ అందిస్తుంది. దీని ధర రూ. 1.01 లక్షలు (ఎక్స్-షోరూమ్, ఢిల్లీ). 125 సీసీ సెగ్మెంట్‌లో సింగిల్-ఛానల్ ఏబీఎస్, ఐబీఎస్ వంటివాటితో వస్తున్న మొట్టమొదటి మోటార్‌సైకిల్ గ్లామర్ ఎక్స్ 125 అని హీరో పేర్కొంది. ఈ కొత్త బ్రేకింగ్ హార్డ్‌వేర్ గట్టిగా బ్రేక్ వేసినప్పుడు ముందు చక్రాలు లాక్ అవ్వకుండా నివారిస్తుంది, అదే సమయంలో ఐబీఎస్ ముందు, వెనుక బ్రేకులను అనుసంధానించడం ద్వారా బ్రేకింగ్ పనితీరును మెరుగుపరుస్తుంది. గ్లామర్ ఎక్స్ బైకులో పానిక్ బ్రేక్ అలర్ట్, హజార్డ్ ల్యాంప్స్ వంటి ఫీచర్లు కూడా కొనసాగుతున్నాయి. హీరో గ్లామర్ ఎక్స్‌లో 124.7 సీసీ సింగిల్ సిలిండర్ ఇంజన్ ఉంటుంది. ఇది 8,250 తీజూఎ వద్ద 11.4ఎప్త్రజూ పవర్.. 6,500తీజూఎ వద్ద 10.5చీఎ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఈ మోటార్‌సైకిల్‌లో ఎకో, రోడ్, పవర్ అనే మూడు రైడింగ్ మోడ్‌లు ఉన్నాయి. అంతేకాకుండా.. ఇందులో క్రూజ్ కంట్రోల్ కూడా ఉంది. హీరో గ్లామర్ ఎక్స్ 125లో బ్లూటూత్ కనెక్టివిటీ, టర్న్ బై టర్న్ నావిగేషన్, కాల్, ఎస్ఎమ్ఎస్ అలర్ట్‌లతో కూడిన కలర్ టీఎఫ్‌టీ ఇన్‌స్ట్రుమెంట్ కన్సోల్ ఉంది. ఇతర ఫీచర్లలో ఫుల్ ఎల్ఈడీ లైటింగ్, యూఎస్బీ టైప్-సీ ఛార్జింగ్ పోర్ట్, సీటు కింద మొబైల్ స్టోరేజ్ వంటివి ఉన్నాయి. ఇంటిగ్రేటెడ్ చాదీూతో కూడిన గ్లామర్ ఎక్స్ గన్ మెటల్ గ్రే, మ్యాట్ యాక్సిస్ గ్రే, బ్లాక్ పెర్ల్ రెడ్, బ్లాక్ టీల్ బ్లూ అనే నాలుగు రంగులలో లభిస్తుంది.

# విదేశీ మారక నిల్వల్లో భారత్ రికార్డు

## రష్యాను అధిగమించి ప్రపంచంలోనే నాలుగో స్థానానికి..!



భారతదేశ ఆర్థికవ్యవస్థ మరో కీలక మైలురాయిని అందుకుంది. ఆర్బీఐ చేపట్టిన ప్రత్యేక పథకం కారణంగా దేశంలోకి డాలర్ల ప్రవాహం రికార్డు స్థాయిలో పెరగడంతో విదేశీ మారక నిల్వలు ఆల్-టైమ్ గరిష్ఠానికి చేరాయి. దీంతో ఫారెక్స్ నిల్వలు కలిగిన దేశాల జాబితాలో రష్యాను అధిగమించి భారత్ ప్రపంచంలోనే నాలుగో స్థానానికి ఎగబాకింది. 'బ్లూమ్‌బర్గ్' డేటా ప్రకారం.. సెప్టెంబర్ 4తో ముగిసిన వారంలో భారత ఫారెక్స్ నిల్వలు ఏకంగా 44.9 బిలియన్ డాలర్లు పెరిగి 785.7 బిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరాయి. ఈ భారీ పెరుగుదలతో ఇప్పటివరకు నాలుగో స్థానంలో ఉన్న రష్యాను భారత్ వెనక్కి నెట్టింది. ప్రస్తుతం ఈ జాబితాలో చైనా, జపాన్, స్విట్జర్లాండ్ మాత్రమే భారత్ కంటే ముందు ఉన్నాయి. ఆర్బీఐ ఈ ఏడాది జూన్ 8న ప్రవేశపెట్టిన ఫారెన్ కరెన్సీ నాన్-రెసిడెంట్ (బ్యాంక్) డిపాజిట్ల స్పెషల్ స్వాప్ పథకానికి అనూహ్య స్పందన లభించడమే ఈ డాలర్ల వరదకు ప్రధాన కారణంగా నిలిచింది. ఈ పథకం ద్వారా కేవలం 11 వారాల్లోనే దేశంలోకి 73 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. నిర్దేశిత లక్ష్యం గడువు కంటే ముందే నెరవేరడంతో, ఆర్బీఐ ఈ పథకాన్ని సెప్టెంబర్ 30కి బదులుగా ఆగస్టు 31నే ముగించింది. అంతర్జాతీయంగా బంగారం ధరలు తగ్గడంతో దేశ పసిడి నిల్వల విలువ 2.59 బిలియన్ డాలర్లు తగ్గినా, డాలర్ల ప్రవాహం అధికంగా ఉండటంతో మొత్తం నిల్వలు భారీగా పెరిగాయి. విదేశీ మారక నిల్వలు ఇంత భారీగా పెరగడం దేశ ఆర్థికవ్యవస్థ పటిష్ఠతకు సంకేతమని, ఇది రూపాయి విలువలో హెచ్చుతగ్గులు వచ్చినప్పుడు స్థిరీకరించేందుకు ఆర్బీఐకి మరింత బలాన్ని ఇస్తుందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## కొత్త బంగారంగా రాగి.. పెట్టుబడిదారుల చూపంతా దీనిపైనే!



విలువైన లోహాలు అంటే.. ముందుగా మనకు గుర్తొచ్చేది బంగారం, వెండి మాత్రమే. పెట్టుబడిదారులు కూడా చాలాకాలంగా వీటినే సురక్షితమైన పెట్టుబడి మార్గాలుగా చూస్తున్నారు. అయితే.. ఇప్పుడు పరిస్థితి కొంత మారుతోంది. రాగి ధరలు భారీగా పెరుగుతూ రికార్డు స్థాయికి చేరుకోవడంతో.. కొందరు దీనిని కూడా కొత్త బంగారంగా అభివర్ణిస్తున్నారు. గత ఏడాది బంగారం ధర దాదాపు 70 శాతం, వెండి ధర ఏకంగా 150 శాతం వరకు పెరిగాయి. ఇదే సమయంలో అల్యూమినియం, పల్లాడియం, ప్లాటినమ్‌తో పాటు రాగి ధరలు కూడా గణనీయంగా పెరిగాయి.

**భారీగా పెరిగిన రాగి ధరలు**

లండన్ మెటల్ ఎక్స్ఛేంజ్‌లో రాగి ధరలు సరికొత్త రికార్డును నమోదు చేశాయి. ఒక దశలో మెట్రిక్ టన్ను రాగి ధర 14,737 డాలర్లకు చేరింది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.14 లక్షలకు సమానం. తవ్వకం, శుద్ధి సామర్థ్యాలకు, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్‌కు మధ్య అంతరం పెరుగుతుండటంతో.. రాగి ధరలు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. రాగి ధరలు పెరగడానికి అమెరికా సుంకాల ప్రభావం కూడా ఒక ముఖ్యమైన కారణం. శుద్ధి చేసిన రాగి దిగుమతులపై అమెరికా సుంకాలు పెంచే అవకాశం ఉందన్న వార్తలతో కొనుగోలుదారులు ముందుగానే పెద్ద మొత్తంలో రాగిని కొనుగోలు చేస్తున్నారు. 2026 తొలి అర్ధభాగంలో అమెరికా సుమారు 8.85 లక్షల టన్నుల రాగిని దిగుమతి చేసుకుంది. దీంతో ప్రపంచంలోని రాగి నిల్వల్లో గణనీయమైన భాగం అమెరికాకు తరలిపోయింది. ఫలితంగా లండన్ మెటల్ ఎక్స్ఛేంజ్‌లో అందుబాటులో ఉన్న నిల్వలు తగ్గాయి. ఇది ధరలు పెరగడానికి కారణమైంది.

**ప్రధాన కారణాలు**

మార్కెట్‌లో రాగికి చాలాకాలంగా డిమాండ్ ఉంది. అయితే డిమాండుకు తగిన సరఫరా లేదు. ప్రపంచంలో ఉన్న పాత రాగి గనులు తమ ఉత్పత్తిని పెంచడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు ప్రధాన రాగి ఉత్పత్తి దేశాల్లో కూడా ఉత్పత్తి, రవాణాకు సంబంధించిన సమస్యలు ఎదురవుతున్నాయి. రాగికి డిమాండ్ పెరగడానికి మరో ప్రధాన కారణం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్. ప్రపంచవ్యాప్తంగా ఏఐ డేటా సెంటర్లు భారీగా నిర్మిస్తున్నారు. ఈ డేటా సెంటర్లలో విద్యుత్ వ్యవస్థలు, కేబుల్స్, నెట్‌వర్క్ పరికరాలు వంటి వాటిలో రాగిని విస్తృతంగా ఉపయోగిస్తారు. అంతే కాకుండా.. సౌర, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన రంగాలు, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థల విస్తరణ కూడా రాగికి డిమాండ్‌ను పెంచుతున్నాయి. అంటే.. భవిష్యత్తులో టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ రంగాలు పెరిగే కొద్దీ రాగి అవసరం కూడా పెరిగే అవకాశం ఉంది.

**భారీ డిమాండ్**

ఈ ఏడాది ఇప్పటి వరకు రాగి ధరలు సుమారు 16 శాతం పెరిగాయి. ముఖ్యంగా.. ఇటీవల నమోదైన రికార్డు ధరలు మార్కెట్ విశ్లేషకుల అంచనాలను కూడా మించిపోయాయి. కొన్ని ప్రముఖ బ్రోకరేజీలు 2026లో రాగి ధరలు టన్నుకు 11,000-12,000 డాలర్ల స్థాయిలో ఉంటాయని అంచనా వేసినప్పటికీ, మార్కెట్ ధరలు ఇప్పటికే ఆ స్థాయిని దాటిపోయాయి. దీంతో రాగి మార్కెట్‌పై పెట్టుబడిదారుల ఆసక్తి మరింత పెరిగింది.

# ఎడ్జ్‌బాస్టన్‌లోనూ చిత్తైన పాకిస్థాన్..

## 3-0తో సిరీస్ గెలుపొందిన ఇంగ్లండ్..!



ఎడ్జ్‌బాస్టన్ టెస్టులోనూ ఇంగ్లండ్ జయభేరి మోగించింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్లు డకౌటైనా కెప్టెన్ జో రూట్(62 నాటౌట్), జోర్డాన్ కాక్స్(59 నాటౌట్) కీలక భాగస్వామ్యంతో పాక్ ఆశలపై నీళ్లు చల్లారు. మొహమ్మద్ అబ్బాస్(2-27) నిప్పులు చెరిగినా.. ఈ జోడీ నింపాదిగా ఆడడడంతో ఆతిథ్య జట్టు 8 వికెట్ల తేడాతో విక్టరీ కొట్టింది. వరసగా మూడు మ్యాచుల్లో గెలుపొందిన ఇంగ్లండ్ 3-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. స్వదేశంలో ఇంగ్లండ్ పంజా విసిరింది. మూడు టెస్టుల సిరీస్‌లో సంపూర్ణ ఆధిపత్యంతో పాకిస్థాన్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. ఎడ్జ్‌బాస్టన్‌లో తొలిరోజు నుంచే పట్టుబిగించిన ఇంగ్లండ్.. నాలుగో రోజే మ్యాచ్‌ను ముగించింది. రెండో ఇన్నింగ్స్‌లో పాక్‌ను 449 పరుగులకే కట్టడి చేసి.. అనంతరం 130 పరుగుల ఛేదనకు దిగిన ఆ జట్టు ఇన్నింగ్స్ మొదటి ఓవర్లోనే ఓపెనర్లను కోల్పోయింది.

**నో బాల్ కావడంతో**

పాకిస్థాన్ పేసర్ మొహమ్మద్ అబ్బాస్(2-20) ఓవర్లో తొలి బంతికి డకెట్(0) వికెట్ కీపర్ చేతికి చిక్కగా.. ఆఖరి బంతికి ఎమిలియో గే(0)ను ఎల్బీగా వెనుదిరిగాడు. అబ్బాస్ విజృంభనతో సున్నాకే రెండు వికెట్లు పడినా కెప్టెన్ జో రూట్(62 నాటౌట్), జోర్డాన్ కాక్స్(59 నాటౌట్) లు ఒత్తిడికి లోనవ్వలేదు. 23 పరుగుల వద్ద బౌల్డయ్యాడు. కానీ, అది నో బాల్ కావడంతో రూట్ బతికిపోయాడు. పాక్ పేసర్లను ధీటుగా ఎదుర్కొన్న ఈ ద్వయం శతక భాగస్వామ్యం నెలకొల్పగా ఆతిథ్య జట్టు 8 వికెట్ల తేడాతో గెలిచింది. తద్వారా 3-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది ఇంగ్లండ్. ఎడ్జ్‌బాస్టన్‌లో ఇప్పటివరకూ ఒక్క మ్యాచూ గెలవని పాక్ ఈసారి కూడా అదే తడబాటుతో మూల్యం చెల్లించుకుంది. ఇక బెన్ స్టోక్స్ వీడ్కోలు తర్వాత మళ్లీ కెప్టెన్సీ చేపట్టిన రూట్ తొలి సిరీస్‌ను ఒడిసిపట్టాడు. డాన్ లారెన్స్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా, ఓలీ రాబిన్సన్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికయ్యారు.

### మహిళల ఆసియాకప్ ఫైనల్లో నేడు శ్రీలంకతో భారత్ ఢీ




దుబాయ్: మహిళల ఆసియాకప్ టి20 టోర్నమెంట్‌లో ఎదురులేకుండా సాగుతున్న భారత జట్టు... నేడు శ్రీలంకతో ఫైనల్‌కు సిద్ధమైంది. ఇప్పటి వరకు తొమ్మిదిసార్లు ఈ టోర్నీ నిర్వహించగా... అందులో ఏడుసార్లు ట్రోఫీ చేజిక్కించుకున్న టీమిండియా... ఎనిమిదో టైటిల్‌పై గురి పెట్టింది. గత ఆసియా కప్ ఫైనల్లో శ్రీలంక చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకున్న టీమిండియా... ఆ పరాజయానికి బదులు తీర్చుకోవాలని భావిస్తోంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు గ్రూప్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి... సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. మరోవైపు శ్రీలంక కూడా గ్రూప్ దశలో అన్నీ మ్యాచ్‌లు నెగ్గి సెమీస్‌లో పాకిస్తాన్‌ను ఓడించి ఫైనల్ చేరింది. ఫామ్‌పరంగా చూసుకుంటే ఈ టోర్నమెంట్‌లో తొలిసారి భారత జట్టుకు కాస్త ప్రతిఘటన ఎదురయ్యే అవకాశాలున్నాయి. స్మృతి మంధాన, షఫాలీ వర్మ రూపంలో భారత జట్టుకు బలమైన ఓపెనింగ్ జోడీ ఉంది. స్మృతి ఇప్పటికే ఈ టోర్నీలో 'శత'క్కొట్టగా... షఫాలీ 168 పరుగులతో టాప్ స్కోరర్‌గా కొనసాగుతోంది. స్పిన్‌కు సహకరిస్తున్న దుబాయ్ పిచ్‌పై ఈ జంట జట్టుకు ఎలాంటి ఆరంభం ఇస్తుందనేదే కీలకం కానుంది. వన్‌డౌన్‌లో బ్యాటింగ్ చేస్తున్న ప్రతీకా రావల్ భారీ ఇన్నింగ్స్ బాకీ ఉండగా... హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్, భారతి ఫూల్మాలితో భారత బ్యాటింగ్ ఆర్డర్ పటిష్టంగా ఉంది. బౌలింగ్‌లో సీనియర్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ కీలకం కానుంది. ఈ టోర్నీలో 11 వికెట్లు తీసి శ్రీలంక సారథి చమరి ఆటపట్టుతో కలిసి అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కొనసాగుతున్న దీప్తి ఫైనల్లోనూ రాణించాల్సిన అవసరముంది. ఆంధ్ర అమ్మాయి శ్రీచరణి తన స్పిన్‌తో ప్రత్యర్థిని ముప్పుతిప్పలు పెడుతుండగా... పేసర్లు నందని శర్మ, క్రాంతి గౌడ్ ఫర్వాలేదనిపిస్తున్నారు. అయితే భారత జట్టుకు ఫీల్డింగ్‌లోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు శ్రీలంక జట్టు అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లో సారథి చమరి ఆటపట్టుపైనే ఎక్కువ ఆధారపడుతోంది.

## స్పోర్ట్స్

### టి20ల్లో జోరు కొనసాగించేందుకు...

**నేడు అఫ్గానిస్తాన్‌తో భారత్ తొలి మ్యాచ్**
**జోష్‌లో టీమిండియా.. సంచలనంపై అఫ్గాన్ దృష్టి**
**సా.గం.7.30 సోనీ స్పోర్ట్స్, సోనీ లివ్‌లలో ప్రసారం**




న్యూఢిల్లీ: భారత్, అఫ్గానిస్తాన్ మధ్య మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు ఫిరోజ్‌షా కోట్లా మైదానంలో తొలి పోరుకు రంగం సిద్ధమైంది. బలాబలాలను బట్టి చూస్తే ప్రత్యర్థికంటే భారత్ అన్ని విధాలా పటిష్టంగా ఉంది. కెప్టెన్‌గా రెండు సిరీస్‌లు కోల్పోయిన తర్వాత జింబాబ్వేతో సిరీస్ విజయాన్ని అందుకున్న శ్రేయస్ అదే జోరును కొనసాగించాలని భావిస్తున్నాడు. అన్నింటికి మించి హార్దిక్ పాండ్యా మినహా టీమిండియా రెగ్యులర్ ఆటగాళ్లతో పూర్తి స్థాయి జట్టుగా బరిలోకి దిగుతోంది. ముఖ్యంగా గాయంనుంచి కోలుకొని పునరాగమనం చేస్తున్న బుమ్రాపై అందరి దృష్టీ నిలిచింది. అయితే అంతర్జాతీయ క్రికెట్‌లో అప్పుడప్పుడు సంచలనాలతో సత్తా చాటిన అఫ్గాన్ టీమ్ ఇక్కడా తమదైన ముద్ర చూపించాలని పట్టుదలగా ఉంది. పలువురు ఐపీఎల్ ఆటగాళ్లు తమ జట్టులో ఉండటం కూడా అఫ్గాన్‌కు కొంత సానుకూలాంశం. ఈ సిరీస్‌లో ఆడుతున్న భారత జట్టే జపాన్‌లో జరిగే ఆసియా క్రీడలకు కూడా వెళుతుంది. ఈ సిరీస్‌లో ఒకే ఒక ప్రశ్న ప్రస్తుతం టీమిండియా మేనేజ్‌మెంట్ ముందు నిలిచింది. అభిషేక్ శర్మతో పాటు రెండో ఓపెనర్‌గా సంజు సామ్సన్, వైభవ్ సూర్యవంశీలలో ఎవరికి అవకాశం ఇస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఐర్లాండ్‌తో సామ్సన్ 2 మ్యాచ్‌లు, ఇంగ్లండ్‌పై తొలి మ్యాచ్ ఆడిన తర్వాత అతడిని తప్పించి వరుసగా మూడు మ్యాచ్‌లలో వైభవ్‌ను ఆడించారు. ఆపై చివరి మ్యాచ్‌కు మళ్లీ సామ్సన్ జట్టులోకి రాగా... జింబాబ్వేతో సామ్సన్ లేకపోవడంతో వైభవ్ మూడు మ్యాచ్‌లూ ఆడాడు. ఇప్పుడు ఇద్దరు అందుబాటులో ఉన్నారు. దులీప్ ట్రోఫీలో చెలరేగిన ఇషాన్ కిషన్, తిలక్ వర్మ ఫార్మాట్‌కు తగినట్లుగా తమ బ్యాటింగ్ శైలిని మార్చుకొని చెలరేగేందుకు ఉత్సాహంగా ఉన్నారు. బ్యాటింగ్‌పరంగా జింబాబ్వేలో ఆశించిన ప్రభావం చూపలేకపోయిన కెప్టెన్ అయ్యర్ పెద్ద ఇన్నింగ్స్ ఆడాల్సి ఉంది. భారత్ ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు రెగ్యులర్ పేసర్లతో బరిలోకి దిగనుండగా, పేస్ ఆల్‌రౌండర్‌గా నితీశ్‌కుమార్ రెడ్డి అందుబాటులో ఉన్నాడు.

**రషీద్‌పై ఆశలు...**

భారత గడ్డపై ఆడటం అఫ్గానిస్తాన్ ఆటగాళ్లకు కొత్త కాదు. ఇక్కడి పరిస్థితులపై వారికి మంచి అంచనా ఉంది. ముఖ్యంగా రషీద్ ఖాన్ ఐపీఎల్‌లో చూపించిన ప్రభావం అసాధారణం. వన్డేల్లో రషీద్ బౌలింగ్‌లో పదును కనిపించకపోయినా, టి20ల్లో అతను ఎప్పుడైనా ప్రమాదకారి. గుర్బాజ్, నబీ, అజ్మతుల్లా, ముజీబ్, నూర్, నవీన్, ఫారుఖీ వంటి ఐపీఎల్ ఆటగాళ్లతో జట్టు నిండి ఉంది. ఈ నేపథ్యంలో అఫ్గాన్‌పై ఉదాసీనత ప్రదర్శిస్తే టీమిండియాకు ఇబ్బంది ఎదురు కావచ్చు. కొత్త కెప్టెన్ ఇబ్రహీమ్ నాయకత్వంలో టీమ్ ఈ సిరీస్‌కు సిద్ధమైంది.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
13 సెప్టెంబర్ 2026






# ‘సలార్’ ఫైట్ పాక్‌లో కాపీ.. అసలు నిజమేంటి?

పాన్ ఇండియా స్టార్ అయిన తర్వాత ప్రభాస్ చేసిన ఫుల్ లెంగ్త్ యాక్షన్ సినిమా ‘సలార్’. కేజీఎఫ్ తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించేసరికి ఈ మూవీపై విపరీతమైన అంచనాలు ఏర్పడ్డాయి. కానీ విడుదల విషయంలో పలుమార్లు వాయిదా పడటంతో ఎందుకనో థియేటర్లలో సరిగా ఫెర్ఫార్మ్ చేయలేదు. కానీ తర్వాత కాలంలో ఓటీటీ, టీవీలో ప్రసారమైన తర్వాత విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఇప్పటికీ ఏదో ఒక సందర్భంలో ‘సలార్’ గురించి వినిపిస్తూనే ఉంటుంది. కానీ రీసెంట్‌గా కొన్నిరోజుల నుంచి ‘సలార్’ ఫైట్ సీన్‌ని పాకిస్తాన్‌కి చెందిన ఓ సినిమాలో కాపీ కొట్టారని చెప్పి సోషల్ మీడియాలో ఓ వీడియో తెగ వైరల్ అవుతోంది. కానీ ఇది ఏ మాత్రం నిజం కాదు. పాక్‌కి చెందిన హసీబ్ బిలాల్ అనే ఇన్ఫ్లుయెన్సర్.. ఏఐ ఉపయోగించి ‘సలార్’ స్ఫూర్తిగా తన ప్రతిరూపంలో వీడియో సృష్టించి దానిని తన ఇన్ స్టాలో పోస్ట్ చేశాడు. చూడటానికి ఇది రియల్‌గా ఉండేసరికి చాలామంది ఇది నిజమని అనుకుంటున్నారు. ఇకపోతే ప్రస్తుతం ఫౌజీ, స్పిరిట్, కల్కి 2 సినిమాలతో ప్రభాస్ బిజీగా ఉండగా.. మరోవైపు ప్రశాంత్ నీల్ ఎన్టీఆర్‌తో ‘డ్రాగన్’ చేస్తున్నాడు. మరి వీళ్లు ఈ ప్రాజెక్టులు పూర్తి చేసిన తర్వాత ‘సలార్ 2’ కోసం కలుస్తారేమో చూడాలి? దీని కోసం ప్రభాస్ ఫ్యాన్స్ కాస్త గట్టిగానే ఎదురుచూస్తున్నారు.

# రచ్చ లేపడానికి రెడీ.. ఒక్క పోస్టుతో ‘స్వయంభూ’పై అంచనాలు పెంచేసిన నిఖిల్



యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా పీరియాడిక్ చిత్రం ‘స్వయంభూ’పై అంచనాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై నిఖిల్ తాజాగా ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ పంచుకున్నారు. ఒకే సినిమా కోసం 175 రోజులు షూటింగ్ చేయడం, 2500 గ్రాఫిక్స్ షాట్లు ఉండటం తన కెరీర్‌లో ఇదే తొలిసారని ఆయన తెలిపారు. మంచి ప్రయత్నాలకు సమయం పడుతుందని, త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు నిఖిల్ తన ‘ఎక్స్’ ఖాతాలో పోస్ట్ చేశారు. “‘స్వయంభూ’ ఒక పాన్ ఇండియా చిత్రంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మంచి పనులకు సమయం పడుతుంది. మేము దాదాపు ఆ దశకు చేరుకున్నాం. ఒకే సినిమా కోసం 175 రోజులు షూట్ చేస్తానని, 2500 గ్రాఫిక్స్ షాట్లు ఉంటాయని నేను ఎప్పుడూ ఊహించలేదు. కానీ... రచ్చ లేపడానికి రెడీ. త్వరలోనే విడుదల తేదీ ప్రకటన ఉంటుంది” అని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌తో సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి నెలకొంది. ఇటీవల హీరోయిన్ సంయుక్త పుట్టినరోజు సందర్భంగా, ఆమె పోషిస్తున్న ‘భూమి’ పాత్రకు సంబంధించిన ఒక బీటీఎస్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో యాక్షన్ సన్నివేశాల కోసం ఆమె పడిన కష్టం స్పష్టంగా కనిపించింది. ఈ సినిమా కోసం సంయుక్త ఎంతో ధైర్యంగా ఒక ప్రమాదకరమైన స్టంట్ చేశారని దర్శకుడు భరత్ కృష్ణమాచారి గతంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లిలో చిత్రీకరించిన ఒక సన్నివేశంలో, కింద నది ప్రవహిస్తుండగా కేవలం ఒకే ఒక్క హార్నెస్ సాయంతో ఆమె రెండు రోజుల పాటు తాడుపై వేలాడుతూ పర్వతాన్ని అధిరోహించారని వివరించారు. ఈ సినిమా కోసం హీరో నిఖిల్ కూడా వియత్నాం వెళ్లి మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. రెండు చేతులతో కత్తి యుద్ధం చేయడంలో ఆయన ప్రావీణ్యం సంపాదించారు. కేవలం హీరో, హీరోయిన్లు మాత్రమే కాకుండా సినిమాలో నటించిన వందలాది మంది సహాయ నటీనటులకు కూడా వియత్నాం నుంచి వచ్చిన నిపుణులతో కత్తి యుద్ధంలో శిక్షణ ఇప్పించారు. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో దాదాపు 60 రోజుల పాటు భారీ క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. భారతీయ సాంస్కృతిక వారసత్వపు మూలాలతో, ఒక యోధుడి గాథ ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. భారీ తారాగణం, అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ‘స్వయంభూ’ విడుదల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# నా సినిమాలను నేను చూడలేను

ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతి జింటా కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కొంత విరామం తర్వాత ఆమె ‘వైబ్’ అనే యాక్షన్ కామెడీ మూవీతో పాటు ‘బట్వారా 1947’ చిత్రం గ్రాండ్ రీఎంట్రీ ఇస్తోంది. ‘వైబ్’లో ఆమె ‘మేడమ్ హెచ్’ అనే పవర్‌ఫుల్ సూపర్ స్పై పాత్రలో కనిపించనున్నారు. వంశిక ధీర్, కునాల్ ఖేము, స్పర్ష్ శ్రీవాస్తవ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా జరిగిన ప్రమోషన్లలో నటి వంశిక ధీర్ మాట్లాడుతూ... పెద్ద తెరపై తనను తాను చూసుకున్నప్పుడు ‘ఇంపొస్టర్ సిండ్రోమ్’ అనిపించిందని చెప్పగా, ప్రీతి జింటా ఆసక్తికరంగా స్పందించింది. ఇన్ని ఏళ్ల అనుభవం ఉన్నా, ప్రతి కొత్త పాత్ర చేసేటప్పుడు ‘చేయగలనా, లేదా?’ అనే సందేహం తనకూ వస్తుందని ఆమె చెప్పింది. “నేను నా సినిమాలను స్క్రీన్ పై ఎప్పుడూ చూడలేను. థియేటర్‌లో కూర్చోవడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. సినిమా చూస్తున్నంతసేపు ఈ సీన్ ఇంకా బాగా చేసి ఉంటే బాగుండేది అనే ఆలోచనే వస్తుంది” అని ప్రీతి వెల్లడించింది.



## మహిళలు మాత్రమే తాళి వేసుకోవాలా.. పెళ్లి గుర్తుగా పురుషులు కూడా ఏదైనా ధరించాలి: నటి నమిత



ఒకప్పుడు దక్షిణాది చిత్ర పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న నటి నమిత... పెళ్లి చేసుకున్న తర్వాత సినిమాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా వివాహ వ్యవస్థ, మహిళలపై అమలవుతున్న సంప్రదాయ నిబంధనలపై చేసిన వ్యాఖ్యలతో మరోసారి చర్చల్లో నిలిచారు. వివాహం అనేది ఇద్దరు వ్యక్తుల జీవితాలను, భావోద్వేగాలను కలిపే సమానమైన బంధమని... అలాంటప్పుడు పెళ్లికి సంబంధించిన నియమాలు, బాధ్యతలు కేవలం మహిళలకే ఎందుకు పరిమితం కావాలని ఆమె ప్రశ్నించడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. వివాహ ఆచారాల గురించి మాట్లాడుతూ... పెళ్లి తర్వాత మహిళలు ఎలా ఉండాలి, ఏం ధరించాలి, ఏయే సంప్రదాయాలను పాటించాలి అనే విషయంలో సమాజంలో ఎన్నో నియమాలు ఉంటాయని నమిత అన్నారు. కానీ పురుషుల విషయంలో ఇలాంటి నిబంధనలు, ఆంక్షలు చాలా తక్కువగా ఉండటం సరైనది కాదని... మారుతున్న కాలానికి అనుగుణంగా అందరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా వివాహానికి గుర్తుగా మహిళలు మాత్రమే తాళిబొట్టు ఎందుకు ధరించాలని, పెళ్లయిందనే గుర్తింపుగా పురుషులు కూడా ఏదో ఒక గుర్తును ఎందుకు ధరించకూడదని ఆమె అన్నారు. నమిత చేసిన ఈ వ్యాఖ్యలకు సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఆధునిక కాలంలో భార్యాభర్తలిద్దరికీ సమాన హక్కులు, ప్రాధాన్యత ఉండాలని కోరుకునే కొందరు నెటిజన్లు ఆమె వ్యాఖ్యలను సమర్థిస్తుండగా... మరికొందరు మాత్రం తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాల ప్రాధాన్యతను అర్థం చేసుకోకుండా ఇలా ప్రశ్నించడం సరికాదని విమర్శలు గుప్పిస్తున్నారు.



# వెంకీ-త్రివిక్రమ్ ‘ఆదర్శ కుటుంబం’ టీజర్ ఇదిగో.. నవ్వులతో మొదలై థ్రిల్లింగ్ మలుపు!

తెలుగు ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కాంబినేషన్లలో విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌లది ఒకటి. ఈ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ‘ఆదర్శ కుటుంబం’ (హౌస్ నెం: 47 /–శాఖ 47) సినిమా నుంచి అభిమానులకు అదిరిపోయే ట్రీట్ వచ్చింది. తాజాగా విడుదలైన ఈ చిత్రం టీజర్, అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతూ సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. టీజర్ ఆరంభం నుంచి త్రివిక్రమ్ మార్క్ స్పష్టంగా కనిపించింది. సరికొత్త లుక్‌లో కనిపించిన వెంకటేశ్, తనదైన కామెడీ టైమింగ్, డైలాగ్ డెలివరీతో కట్టిపడేశారు. “డబ్బు సబ్బు లాంటిది రా, చేతులు కడుక్కోవడానికే పనికొస్తుంది”, కుటుంబం అప్పుల లెక్కలు చెప్పే సన్నివేశాలు, వంటింట్లో జరిగే సంభాషణలు ప్రేక్షకుల పెదాలపై నవ్వులు పూయించాయి. మధ్యతరగతి కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను వినోదాత్మకంగా చూపిస్తూనే, కథలో కీలక మలుపును పరిచయం చేశారు. కుటుంబమంతా కలిసి ‘–శాఖ 47’ అనే పేరున్న ఓ డ్యూప్లెక్స్ ఇంట్లోకి మారడంతో కథ మరో స్థాయికి వెళుతుంది. అంతా సంతోషంగా సాగుతున్న సమయంలో ఓ క్రైమ్ సంఘటన జరగడం, విలన్ ఎంట్రీతో టీజర్ ఒక్కసారిగా సీరియస్ టర్న్ తీసుకుంటుంది. దీంతో ఈ సినిమా కేవలం కుటుంబ కథ మాత్రమే కాదని, ఇందులో థ్రిల్లింగ్ అంశాలు కూడా ఉన్నాయని స్పష్టమవుతోంది. కామెడీ, ఎమోషన్స్, సస్పెన్స్‌తో కూడిన ఒక సంపూర్ణ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను త్రివిక్రమ్ సిద్ధం చేసినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. ఈ చిత్రంలో వెంకటేశ్ సరసన ‘కేజీఎఫ్’ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. నారా రోహిత్, దివ్యేందు శర్మ, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిశోర్ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో భాగమయ్యారు. తమన్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు అదనపు ఆకర్షణగా నిలిచింది. నిర్మాతలు ఈ చిత్రాన్ని గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విడుదలైన కొద్ది గంటల్లోనే విశేష స్పందన రాబట్టుకున్న ఈ టీజర్, సినిమాపై ఉన్న అంచనాలను తారాస్థాయికి చేర్చింది.

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001. Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184. Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.